ప్రజాశక్తి

మంగళవారం 2 ఏప్రిల్ 2024   8 పేజీలు


గుంటూరు


పల్నాడు

తీసుకోగలమా?

- పింఛను అందుతుందో? లేదో? అని లబ్ధిదారుల్లో ఆందోళన
- వికలాంగులు, మంచానికే పరిమితమైన వారు, వృద్ధుల్లో కంగారు
- ఎన్నికల కమిషన్ నిర్ణయంపై అసంతృప్తి
- ప్రత్యామ్నాయ మార్గల్లోనైనా ఇళ్ల వద్దకే తెచ్చివ్వాలని డిమాండ్
- తీవ్రంగా ఉన్న ఎండలను దృష్టిలో పెట్టుకోవాలని వేడుకోలు



ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

ఎన్నికల కోడ్ అమలులో ఉన్న నేపథ్యంలో ఎన్నికల సంఘం వాలంటీర్ల ద్వారా పింఛను పంపిణీ చేయరాదని పెట్టిన నిబంధనలపై వికలాంగులు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటి వరకు ఇంటి వద్దకే వచ్చి పింఛను అందించడం వికలాంగులు, వృద్ధులకు సౌలభ్యంగా ఉందని, ఇప్పుడు మళ్లీ సచివాలయాల వద్దకు వెళ్లి గంటల తరబడి వరుసలో నిల్చొని తీసుకోవాలంటే అనేక సమస్యలు వస్తాయని వాపోతున్నారు.

పల్నాడు జిల్లాలో పింఛను తీసుకునే వికలాంగులు 20 వేల మందికి పైగా ఉన్నారు. వీరిలో 18 శాతం మంది ఒకటి లేదా రెండు కాళ్లు లేనివారు, మంచానికే పరిమితమైన వారు ఉన్నారు. వీరందరికీ ఇప్పుడు పింఛను ఎలా తీసుకోవాలనే విషయంపై ఆందోళన నెలకొంది. ఇప్పుడిస్తున్నట్లే ఇళ్ల వద్దకే పింఛను వచ్చేలా ప్రత్యామ్నాయ మార్గాలు ఆలోచించాలని వీరంతా కోరుతున్నారు.

వికలాంగులకు ఇంటి వద్దే ఇవ్వాలి



కర్నాటి కృష్ణమూర్తి, నవభారత దివ్యాంగుల సంక్షేమ సంఘం పల్నాడు జిల్లా అధ్యక్షులు.

ఇప్పటి వరకు పింఛను నేరుగా ఇంటికి రావడంతో మాకు ఇబ్బందేమీ రాలేదు. పోలియో బారిన పడి రెండు కాళ్ళు చచ్చుబడిన వారు, పక్షవాతం బారిన పడి వారు సచివాలయాల వద్దకు వెళ్లాలంటే జోగాడుతూ పోవాల్సి వస్తుంది. లేదా సహాయకులను పెట్టుకుని వెళ్లాలి. ఎండలు ఎక్కువగా ఉన్నందు వల్ల ఇది అందరికీ సాధ్యమయ్యేది కాదు. మహిళలు, మంచానికే పరిమితమైన వారిని దృష్టిలో పెట్టుకుని ప్రత్యామ్నాయం దిశగా ఎన్నికల కమిషన్ ఆలోచించి వికలాంగులకు ఇంటి వద్దకే పించను ఇచ్చే ఏర్పాటు చేయాలి.

ప్రత్యామ్నాయాన్ని ప్రభుత్వమే అన్వేషించాలి



ఎస్. ఆంజనేయ నాయక్, సిఐటియు పల్నాడు జిల్లా ప్రధాన కార్యదర్శి.

ఎన్నికల కోడ్ అమలులో ఉన్న దృష్ట్యా వాలంటీర్ల ద్వారా ఇంటి వద్దకే పింఛను ప్రక్రియ నిలిపివేయాలనే ఎన్నికల కమిషన్ ఆదేశాల నేపథ్యంలో ప్రభుత్వమే ప్రత్యామ్నాయ మార్గాన్ని అన్వేషించాలి. నడవలేని వృద్ధులకు, మంచానికే 2లో

బతుకు సమరంలో మరో ఇద్దరు బలి

- కూలిపనులకు వెళ్తున్న ఇద్దరు మహిళా కూలీలు మృతి
- ఆటో తిరగబడి ఒకరు.. ట్రాక్టర్ నుండి కింద పడి మరొకరు

ప్రజాశక్తి - మాచర్ల, చిలకలూరిపేట

ఏరోజుకారోజు కూలి పనులు చేసుకుంటే గాని పూట గడవని కూలీలు ఉపాధి వేటకు వెళ్తూ ప్రమాదాలకు బలవుతున్నారు. తాజాగా మాచర్ల, చిలకలూరిపేట పట్టణాలకు సమీపంలో వాటిల్లిన ప్రమాదాల్లో ఇద్దరు మహిళా కూలీలు దుర్మరణం పాలయ్యారు. వివరాల ప్రకారం.. మాచర్ల పట్టణంలోని సెరీన్ కాలనీకి చెందిన 15 మంది వరకు మహిళా కూలీలు కొంతకాలంగా వెల్దుర్తి మండలం కళ్లకుంట గ్రామానికి మిర్చి కోతలకు ఆటోలో వెళ్తున్నారు. పట్టణ శివారు ప్రాంతం మండాది బోడుపై అడవి పంది అడ్డుగా రావడంతో దాన్ని తప్పించే క్రమంలో ఆటో అదుపుతప్పి బోల్తా పడింది. ఆటోలోని నారోజు నారాయణమ్మ (50) అక్కడికక్కడే మృతి చెందగా మహంకాళి నాగేంద్రమ్మ, చల్ల విజయ, బుజ్జి, మున్ని, డ్రైవర్ దాసుకు గాయాలయ్యాయి. క్షతగాత్రులను మాచర్ల ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. పోలీసులు కేసు నమోదు చేశారు. మృతురాలికి 2లో





మాచర్ల వద్ద ప్రమాదంలో మృతి చెందిన నారాయణమ్మ, చికిత్స పొందుతున్న మరో ఇద్దరు మహిళలు

తనిఖీల్లో రెండు కార్లు సీజ్

ప్రజాశక్తి-గుంటూరు

సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో సోమవారం ఫ్లైయింగ్ స్క్వాడ్‌లు ఎన్నికల ప్రవర్తనా నియమావళి ఉల్లంఘనకు సంబంధించి నిర్వహించిన తనిఖీల్లో గుంటూరు తూర్పు నియోజకవర్గ పరిధిలో ఒక స్కార్పియో వాహనం (విలువ రూ.15,00,000), ఒక పజీరో (విలువ రూ.28,00,000) వాహనాలను సీజ్ చేశారు. కోడ్ అమలులోకి వచ్చిన తర్వాత చేపట్టిన తనిఖీల్లో సోమవారం సాయంత్రం 6 గంటల వరకు రూ.కోటి 72 లక్షల 65 వేల 950 నగదు, మద్యం, ఇతర వస్తువులను సీజ్ చేశారు.



విలేకర్లతో మాట్లాడుతున్న జంగా కృష్ణమూర్తి

వైసిపికి ఎమ్మెల్సీ జంగా కృష్ణమూర్తి రాజీనామా

ప్రజాశక్తి - దాచేపల్లి

వైసిపి రాజీనామా చేస్తున్నట్లు ఎమ్మెల్సీ జంగా కృష్ణమూర్తి ప్రకటించారు. తనను నమ్ముకున్న వారికోసం టిడిపిలో చేరుతానని చెప్పారు. మండలంలోని గామాలపాడులో సోమవారం ఆయన విలేకర్లతో మాట్లాడారు. వైసిపి ఆవిర్భావం నుండి ఆ పార్టీలో విధేయంగా పని చేశానని, 2019 ఎమ్మెల్యే సీటు కూడా త్యాగం చేశానని చెప్పారు. అయితే ప్రస్తుతం గురుజాల నియోజకవర్గంలో ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి 'పార్టీ నాది' అనే తరహాలో ప్రవర్తిస్తున్నారని, ఆయన తీరుతో తనను నమ్ముకున్న ఒక్క ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలకు కూడా న్యాయం చేయలేకపోయానని చెప్పారు. దీనిపై పార్టీ పెద్దలకు వివరించినా సమాధానం లేకపోవడంతో పార్టీని వీడుతున్నట్లు చెప్పారు. తన నిర్ణయం బాధాకరమే అయినా తన ప్రాథమిక సభ్యత్వానికి బీసీ అధ్యక్ష పదవికీ రాజీనామా చేస్తున్నట్టు ప్రకటించారు.

పకడ్బందీగా ఎన్నికల కోడ్ అమలు

- సింగిల్ విండో విధానంలో దరఖాస్తులకు అనుమతులు
- గుంటూరు జిల్లా కలెక్టర్ ఎం.వేణుగోపాల్‌రెడ్డి

ప్రజాశక్తి-గుంటూరు



మీడియాతో మాట్లాడుతున్న కలెక్టర్ వేణుగోపాల్‌రెడ్డి

ఎన్నికల కోడ్ అమలుకు పటిష్ట చర్యలు తీసుకుంటున్నామని గుంటూరు జిల్లా కలెక్టర్ ఎం.వేణుగోపాల్‌రెడ్డి చెప్పారు. కోడ్ ఉల్లంఘనలపై ఎప్పటికప్పుడు చర్యలు తీసుకుంటున్నామని, అయినా అక్కడక్కడా ఉల్లంఘనలు కొనసాగుతున్నాని, వారిపై చట్టప్రకారం చర్యలు తీసుకుంటామని చెప్పారు. కలెక్టరేట్ ప్రాంగణంలో నూతనంగా ఏర్పాటు చేసిన ఎన్నికల మీడియా సెంటర్‌లో సోమవారం కలెక్టర్ మీడియాతో మాట్లాడారు. జిల్లాలో 13 చెక్‌పోస్టులు ఏర్పాటు చేసి తనిఖీలు చేస్తున్నామని, ఇప్పటి వరకూ ఆధారాలు చూపని రూ.1.60 కోట్లకుపైగా నగదు, ఇతర సామగ్రి సీజ్ చేశామని తెలిపారు. పెళ్లిళ్లు, హాస్పిటల్ వంటి వ్యక్తిగత అవసరాల కోసం నగదుతో ప్రయాణిస్తూ పట్టుబడితే వారు జిల్లా కలెక్టరేట్‌లో ఏర్పాటు చేసిన గ్రీవెన్స్‌లో అర్జీ అందచేస్తే ప్రతిరోజూ సాయంత్రం 3 గంటలకు జరిగే గ్రీవెన్స్ కమిటీ సమావేశంలో సమీక్షించి, పరిష్కరిస్తామని తెలిపారు. కోడ్ ఉల్లంఘించిన 124 మంది వాలంటీర్లు, నలుగురు కాంట్రాక్ట్ ఉద్యోగులు, ఒక రెగ్యులర్ ఉద్యోగిపై చర్యలు తీసుకున్నామన్నారు.

ఎన్నికల షెడ్యూలు గురించి వివరిస్తూ నెల 18 నుండి 25వ తేదీ వరకూ నామినేషన్ల స్వీకరణ, 26న స్క్రూట్నీ, 29న నామినేషన్ల ఉపసంహరణ ఉంటుందన్నారు. మే 13న పోలింగ్, జూన్ 4న కౌంటింగ్ 2లో

నరసరావుపేట పార్లమెంట్ స్థానం నుండి
కాంగ్రెస్ అభ్యర్థిగా అలెగ్జాండర్ సుధాకర్

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా



నరసరావుపేట పార్లమెంట్ స్థానానికి కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిగా ఆ పార్టీ పల్నాడు జిల్లా అధ్యక్షులు, ప్రముఖ న్యాయవాది అలెగ్జాండర్ సుధాకర్‌ను ఎఐసిసి ప్రకటించింది. 2013లో రాష్ట్ర విభజన అనంతరం అనేకమంది నాయకులు కాంగ్రెస్‌ను వీడారు. అయినా కాంగ్రెస్‌లోనే కొనసాగుతున్న అలెగ్జాండర్ సుధాకర్ నరసరావుపేట నియోజకవర్గ అధ్యక్షునిగా, జిల్లాల విభజన అనంతరం పల్నాడు జిల్లా కాంగ్రెస్ అధ్యక్షునిగా నియమితులయ్యారు. పార్టీ పిలుపునిచ్చిన అన్ని కార్యక్రమాలనూ నిర్వహిస్తూ వస్తున్న ఆయన 2014, 2019 ఎన్నికల్లోనూ కాంగ్రెస్ పార్టీ తరుపున నరసరావుపేట ఎమ్మెల్యే అభ్యర్థిగా పోటీ చేసి ఓడిపోయారు. తాజాగా ఎంపీ అభ్యర్థిగా తనను ప్రకటించడంపై అలెగ్జాండర్ సుధాకర్ మాట్లాడుతూ ఎఐసిసి అధ్యక్షులు మల్లిఖార్జున ఖర్గే, ఉపాధ్యక్షులు రాహుల్ గాంధీ, సోనియా గాంధీ, రాష్ట్ర అధ్యక్షులు వైఎస్ షర్మిలకు కృతజ్ఞతలు తెలిపారు. రాష్ట్రానికి ప్రత్యేక హోదా, విభజన హామీల అమలు, రాజధానికి నిధులు, పంటలకు మద్దతు ధరలు, పరిశ్రమల స్థాపన, యువతకు ఉద్యోగాలు వంటివి కాంగ్రెస్ పార్టీతోనే సాధ్యమని అన్నారు.



రంజాన్ వేళలు

ఇఫ్తార్ (మంగళవారం సాయంత్రం) : 6.26

సహరీ (బుధవారం ఉదయం) : 4.45

తీసుకోగలమా?

(మొదటి పేజీ తరువాయి)

పరిమితమైన వికలాంగులకు కచ్చితంగా ఇంటి వద్దనే యథావిధిగా పింఛను అందించాలి. ఇప్పటి వరకూ వాలంటీర్ల ద్వారా అందిన సేవలకు ఆటంకం లేకుండా, ఎన్నికల నియమావళిని అనుసరిస్తూ ప్రజలకు ఇబ్బందులు రాకుండా చూడాలి.

వికలాంగులు ఎక్కడుంటే అక్కడే ఇవ్వాలి

ఏనుగంటి కృష్ణారావు, తుంగపాడు గ్రామం, రొంపిచర్ల, మండలం.

నవభారత దివ్యాంగుల సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యదర్శి



ఎన్నికల నేపథ్యంలో వాలం టీర్లను పెన్షన్ పంపిణీకి దూరంగా ఉంచడం హర్షణీయమైనా వికలాం గులు, వృద్ధులకు ఇప్పటివరకు పంపిణీ చేసిన మాదిరిగానే పింఛనును ఇంటివద్దే పంపిణీ చేయాలి. గతంలో లబ్ధిదారులు రెండు నెలల పాటు అందుబాటులో లేకపోయినా 3వ నెలలో మొత్తం పెన్షన్ అందజేసేవారు. ప్రస్తుతం ఒకనెల పింఛను తీసుకోకపోయినా మరుసటి నెలలో పింఛను రాదని చెప్పారు. దీంతో అనారోగ్యంతో హాస్పిటల్‌లో చికిత్స పొందుతున్నా, ఇతరత్రా వ్యక్తిగత పనులపై ఇతర ప్రాంతాలకు వెళ్లినా పింఛను కోసం నానా తిప్పలు పడి రావాల్సి వస్తోంది. వికలాంగులు ఏ ప్రాంతంలో ఉన్నా అక్కడే పింఛను పొందేలా ప్రత్యేక వ్యవస్థ ఏర్పాటు చేయాల్సిన అవసరాన్ని ప్రభుత్వాలు గుర్తించాలి. వాలంటీర్లు ఇతర ప్రాంతాలకు వెళ్లి పింఛను పంపిణీ చేసే క్రమంలో బస్సు ఛార్జీలతో పాటు అదనంగా డబ్బులు వసూలు చేశారు.

యథావిధిగానే పంపిణీకి అవకాశం ఇవ్వాలి

నల్లపాటి రామారావు, పిడిఎం సీనియర్ నాయకులు.

ఎండలు విపరీతంగా ఉన్న దృష్ట్యా సచివాలయాల వద్దకు వెళ్లి పింఛను తీసుకోవాలంటే లబ్ధిదారులు ఇబ్బంది పడతారు. పింఛనుదారుల్లో అధిక శాతం మంది వికలాంగులు, మంచానికే పరిమితమై అనారోగ్యంతో చికిత్స పొందుతున్నారు. ఎన్నికల కమిషన్ ఆదేశించడంతో అనేకమంది ఆందోళన చెందుతున్నారు. నిబంధనలు సడలించి యథావిధిగానే పింఛన్లు పంపిణీకి అవకాశం ఇవ్వాలి.

పకడ్బందీగా ఎన్నికల కోడ్ అమలు

(మొదటి పేజీ తరువాయి)

ఉంటుందన్నారు. జూన్ 6వ తేదీ వరకూ కోడ్ అమలులో ఉంటుందని చెప్పారు. జిల్లాలో 1884 పోలింగ్ స్టేషన్లు ఉన్నాయన్నారు. 1500 దాటిన చోట్ల, ఆగ్జలరీ బూత్‌లు ఏర్పాటుకు సంబంధించి 31 అదనపు బూత్‌ల ఏర్పాటుకు ప్రతిపాదనలు ఈసీకి పంపించామన్నారు. జిల్లాలో తుదిజాబితా విడుదలయ్యే నాటికి 17,69,318 మంది ఓటర్లు ఉన్నారని, ఆ తర్వాత నమోదైన ఓట్లతో కలుపుకొని 17,83,488 ఓటర్లు ఉన్నట్లు వివరించారు. నామినేషన్ల స్వీకరణకు చివరి తేదీ వరకూ ఓటు నమోదు చేసుకోవచ్చని తెలిపారు. ఈసీ ఆదేశాల మేరకు సచివాలయాల ద్వారా పెన్షన్లు పంపిణీకి చర్యలు తీసుకుంటామని, వాలంటీర్లు పెన్షన్ల పంపిణీకి దూరంగా ఉంటారన్నారు. ఎన్నికల విధుల్లో పాల్గొనే ఉద్యోగులతోపాటు 33 రకాల కేటగిరీల ఓటర్లకు పోస్టల్ బ్యాలెట్ వేసేందుకు ఈసీ అనుమతి ఇచ్చిందన్నారు. రాజకీయ పార్టీల దరఖాస్తులకు సంబంధించి సింగిల్ విండో విధానంలో 48 గంటలలోగా అనుమతులు మంజూరు చేస్తున్నట్లు చెప్పారు. గుంటూరు తూర్పు, పశ్చిమ నియోజక వర్గంతోపాటు, పట్టణ ప్రాంతాల్లో ఓటింగ్ శాతం పెంచటానికి కృషి చేస్తామన్నారు. సమావేశంలో జేసీ రాజకుమారి తదితరులు పాల్గొన్నారు. అనంతరం మీడియా మానిటరింగ్ సెంటర్‌ను కలెక్టర్ పరిశీలించారు. కారక్రమంలో ఐటి నోడల్ అధికారి రఘు, మీడియా నోడల్ అధికారి గాలిదేముడు, సమాచార శాఖ డిడి అబ్దుల్ రఫిక్ పాల్గొన్నారు.



అక్రమాలపై విచారణ చేయించండి

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి

ఎపిపిఎస్సి అక్రమాల పైన ఉన్నత స్థాయిలో విచారణ జరిపి బాధ్యులైన ప్రతి ఒక్కరి పైన చర్యలు తీసుకోవాలని గుంటూరు జిల్లా తెలుగు యువత అధ్య క్షులు రావిపాటి సాయి కృష్ణ, టి ఎన్ ఎస్ ఎఫ్ అధ్యక్షులు మన్నవ వంశి కృష్ణ కోరారు. 2018 గ్రూప్-1 మెయిన్స్ నోటిఫికేషన్ కు సంబంధించి 2019లో జరిపిన ప్రిలిమ్స్ 2020లో జరిపిన మెయిన్స్ పరీక్షల డిజిటల్ మూల్యాంకనంలో ఒమర్ షీట్లు మార్చి పోస్టుల భర్తీలో అక్రమాలకు పాల్పడ్డారని తెలిపారు.

ఎండ నుండి రక్షణకు తగిన చర్యలు తీసుకోవాలి

ప్రజాశక్తి-గుంటూరు

ఎండల తీవ్రత పెరుగుతున్నందు వల్ల జిల్లాలోని భవన, ఇతర నిర్మాణ కార్మికులు తగిన జాగ్రత్తలు తీసుకునేలా భవన యజమానులు చర్యలు తీసుకోవాలని ఉపకార్మిక కమిషనర్ ఒక ప్రకటనలో తెలిపారు. కార్మికులతో మధ్యాహ్నం 12 గంటలలోపు, సాయంత్రం 4 గంటల తర్వాత పనులు చేయించుకోవాలన్నారు. అలాగే ప్యాక్టరీలు, షాపులలో పని చేస్తున్న కార్మికులు, మహిళా కార్మికుల రక్షణకు తగిన చర్యలు తీసుకోవాలన్నారు. పని ప్రదేశాల్లో మంచినీరు, విశ్రాంతికి నీడ స్థలం ఏర్పాటు చేయాలని, గ్లూకోజ్, ఓఆర్ఎస్ ప్యాకెట్లు, మజ్జిగ అందుబాటులో ఉంచాలన్నారు. మహిళా కూలీలతో పసి పిల్లల తల్లులు ఉంటే వారిని తొందరగా ఇంటికి పం పించాలన్నారు. అలాగే మరుగుదొడ్డి సౌకర్యం కల్పించాలని, వడదెబ్బ తగలకుండా యజమానులు అన్ని రకాల చర్యలూ తీసుకోవాలన్నారు.

పాలిసెట్ ప్రవేశానికి ఉచిత శిక్షణా తరగతులు

ప్రజాశక్తి-తాడేపల్లి రూరల్

ఎంటిఎంసి పరిధిలోని వడ్డేశ్వరం కె ఇ ఎస్ పాలిటెక్నిక్ కళాశాలలో ఏప్రిల్ 1వ తేదీ నుండి 25వ తేదీ వరకు పాలీ సెట్ ప్రవేశానికి ఉచిత శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపల్ కే పద్మజావాణి సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. పాలిటెక్నిక్ చదవాలనుకున్న విద్యార్థులు ఈ శిక్షణా తరగతులకు హాజరై, ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసు కోవాలని, వివరాలకు 08645293145 అనే నంబర్‌లో సంప్రదించాలని కోరారు. ఉదయం 9:30 నుండి మధ్యాహ్నం ఒంటిగంట వరకు తరగతులు జరుగుతాయని తెలిపారు.



పిచ్చుకను రక్షించుకోవటం మన బాధ్యత

విజయవాడ : పిచ్చుకను చేసుకుందామా మచ్చిక అనే నినాదంతో నిర్వహించిన సేవ్ స్పారో నేషనల్ లెవెల్ ఆర్ట్ కాంటెస్ట్ చిత్రకళా ప్రదర్శన, బహుమతి ప్రదానోత్సవం సోమవారం కన్నుల పండువగా జరిగింది. నగరానికి చెందిన స్ఫూర్తి క్రియేటివ్ ఆర్ట్ స్కూల్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో అమీర్ చిత్రకథ చీఫ్ ఆపరేటింగ్ ఆఫీసర్ కష్ణ కిరణ్ చిత్రకళా ప్రదర్శనను లాంచనంగా ప్రారంభించారు. అతిథులుగా హాజరైన, గోళ్ళ నారాయణ రావు, ఎస్.పి. రామరాజు, అనిల్ డానీ, ఏడుకొండలు యాదవ్ లు పర్యావరణ పరిరక్షణ, జీవ రాశుల సంరక్షణకై మనం పోషించాల్సిన పాత్ర గురించి విపులంగా వివరించారు. ఈ కార్యక్రమంలో భాగంగా పిచ్చుకల మనుగడకై పాటుపడుతున్న డాక్టర్ వీరా మహేష్, రమేష్ సుంకోజు, పోలుపర్తి దాలి నాయుడును స్ఫూర్తి క్రియేటివ్ ఆర్ట్ స్కూల్ సంస్థ ఘనంగా సత్క రించింది. అనంతరం బహుమతి ప్రదానోత్సవం జరిగింది.

6న ఐఎఐసిఎస్ ప్రథమ వార్షికోత్సవం

: డాక్టర్ వరుణ్

ప్రజాశక్తి - విజయవాడ అర్బన్ : ఈనెల 6న ఇండియన్ అసోసియేషన్ ఆఫ్ ఇంటర్వెన్షనల్ కార్డియాక్ సర్జన్స్ (ఐఎఐసిఎస్) ప్రథమ వార్షికోత్సవం నిర్వహించనున్నట్లు అసోసియేషన్ జనరల్ సెక్రటరీ, డాక్టర్ వరుణ్ కార్డియాక్ సైన్సెస్ చైర్మన్ డాక్టర్ గుంటూరు వరుణ్ తెలిపారు. ఈ సభ హోటల్ తాజ్ వివంతాలో నిర్వహించనున్నట్లు చెప్పారు. బెంజ్ సర్కిల్ సమీపంలోని డాక్టర్ వరుణ్ కార్డియాక్ సైన్సెస్‌అఓ సోమవారం నిర్వహించిన విలేకరుల సామవేశంలో ఆయన మాట్లాడారు. ఈ సభలో విదేశాల నుండి 100 నుండి 150 మంది వరకు ప్రముఖ సర్జన్స్ పాల్గొంటారని తెలిపారు. తాను స్థాపించిన రాధా లక్ష్మి హార్ట్ ఫౌండేషన్ సహకారంతో కృష్ణా మిల్క్ యూనియన్ సభ్యులైన పాడి రైతులకు అందిస్తున్న ఉచిత వైద్య సేవల ముగింపు సందర్భంగా ఈ సభ జరుగుతోందని ప్రజలందరికీ అత్యాధునాతన గుండె వైద్యం అందుబాటులోకి రావలసిన అవసరం గురించి ఈ సభలో చర్చించనున్నట్లు తెలిపారు. అనంతరం కృష్ణా మిల్క్ యూనియన్ చైర్మన్ చలసాని ఆంజనేయులు మాట్లాడుతూ అత్యాధునిక వైద్యాన్ని మారుమూల గ్రామీణ ప్రజలకు కూడా అందుబాటులోకి తీసుకువచ్చిన డాక్టర్ వరుణ్ దేశ విదేశాల్లో ఉన్న ఇంటర్వెన్షనల్ కార్డియాక్ సర్జన్స్‌తో విజయవాడ వేదికగా అసోసియేషన్ ఏర్పాటు చేయడం అభినందనీయ మన్నారు.



మాట్లాడుతున్న డాక్టర్ వరుణ్

తమ యూనియన్ సభ్యులైన 1700 మందికి పైగా పాడి రైతులకు ఇప్పటి వరకు ఉచిత వైద్య పరీక్షలు నిర్వహించారని వారిలో 940 మందికి గుండె సంబంధ సమస్యలున్నట్లు ప్రాథమికంగా గుర్తించి, యాంజియో పరీక్షలు నిర్వహించి, అవసరమైన వారికి స్టంట్లు అమర్చుతున్నారని, ఇంకా అవసరమైన వారికి బైపాస్ సర్జరీలతో పాటు అత్యంత ఖరీదైన 'టావీ' చికిత్స కూడా ఉచితంగా చేసేందుకు ముందుకు వచ్చారన్నారు. ఇటువంటి ఆదర్శవంతమైన సేవలు ఐఎఐసిఎస్ వేదికగా దేశవ్యాప్తింగా విస్తరించాలన్నారు.





చిలకలూరిపేటలో కృపమ్మకు నివాళులర్పిస్తున్న ఎమ్మెల్సీ మర్రి రాజశేఖర్, మాజీ మంత్రి పత్తిపాటి పుల్లారావు

బతుకు సమరంలో మరో ఇద్దరు బలి

(మొదటి పేజీ తరువాయి)

ఇద్దరు కుమారులు, ఒక కుమార్తె కాగా భర్త నాలుగేళ్ల కిందటే మర ణించాడు. ఒక కుమారుడు, కుమార్తెకు వివాహాలయ్యాయి. కుమారులిద్దరూ హైదరాబాద్‌లో చిన్న ప్రైవేటు ఉద్యోగాలు చేసుకుంటుండగా నారాయణమ్మ ఒక్కరే ఉంటూ కూలి పనులు చేసుకుని జీవిస్తున్నారు.

చిలకలూరిపేట పట్టణంలోని సంజీవ నగర్‌కు చెందిన మూకిరి కృపమ్మ (39), మరో ఆరుగురు మహిళా కూలీలు మిర్చి కోతల కోసం మండలంలోని కట్టుబడి వారిపాలేనికి మిర్చి కోతలకు వెళ్తున్నారు. తెల్లవారుజామున 5 గంటలప్పుడు వీరు ట్రాక్టర్‌లో వెళ్తుండగా పట్టణ శివారు టిడ్కో ఇళ్ల సమీపంలోని రహదారిపై గుంతల్లో పడిన ట్రక్కు పెద్ద కుదుపునకు గురవ డంతో ట్రాక్టర్ నుండి కింద పడిన కృపమ్మ తీవ్రంగా గాయపడ్డారు. వెంటనే ఆమెను పట్టణంలోని ఒ ప్రైవేటు ఆస్పత్రికి తీసుకెళ్లారు. ప్రభుత్వాస్పత్రికి తీసుకెళ్లాలని అక్కడివారు చెప్పడంతో తీసుకెళ్తుండగా మార్గం మధ్యలోనే మృతి చెందారు. మృతురాలికి భర్త, ఇద్దరు కుమార్తెలు, ఒక కుమారుడు ఉన్నారు. మృతదేహాన్ని ఎమ్మెల్సీ మర్రి రాజశేఖర్, మాజీ మంత్రి పత్తిపాటి పుల్లారావు, జనసేన నియోజక వర్గం సమన్వయకర్త టి.రాజారమేష్ సందర్శించి నివాళులర్పించారు. ఇదిలా ఉండగా గుంటూరు జిల్లా పెదనందిపాడు మండలం పాలపర్రు సమీపంలో ఇటీవల రోడ్డు ప్రమాదంలో ఒక మహిళ మృతి చెందగా 9 మంది మృతి చెందారు. దుగ్గి రాలలో ఒ కార్పెంటర్ కూడా ప్రమాదంలో చనిపోయిన విషయం తెలిసిందే.

ప్రజాశక్తి
గుంటూరు, పల్నాడు
3
మంగళవారం 2 ఏప్రిల్ 2024

రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతి

ప్రజాశక్తి-చిలకలూరిపేట

రోడ్డుప్రమాదంలో ఒకరు మృతి చెందిన సంఘటన చిలకలూరిపేటలో సోమవారం జరిగింది. సంజీవ నగర్ లోని తన స్నేహితుడైన డానియేల్‌తో కలిసి స్కూటీపై వెళుతున్న రావూరి రామ కృష్ణ మృతి చెందాడు. సంజీవనగర్ నుంచి విజయ బ్యాంక్ వైపునకు జాతీయ రహదారిని దాటే క్రమంలో నెల్లూరు నుండి కాకినాడకు వెళ్తున్న కంటైనర్ వీరి వాహనాన్ని ఢీ కొనడంతో రామకష్ణ(26) అక్కడి కక్కడే మృతి చెందాడు. పోలీసుల కథనం ప్రకారం స్థానిక కుమ్మరి కాలనీ హోసన్న మందిర్ దగ్గరలో నివాసముంటున్న శివయ్య కు ఇద్దరు కుమారులు. మొదటి కుమారుడైన రావూరి రామకృష్ణ. గత ఏడాదిలో డిగ్రీ పూర్తి చేశాడు. ఉద్యోగ ప్రయత్నంలో ఉన్న రామకృష్ణ, అతని స్నేహితుడైన ఎం.టి.ఆర్ కాలనీలో నివసిస్తున్న డానియేల్‌నుతన వాహనంపై ఎక్కించుకుని సోమవారం మధ్యాహ్నం వెళుతున్నాడు. జాతీయ రహదారి దాటే క్రమంలో ట్రక్కు ఢీకొని ప్రమాదం జరిగిందని పోలీసులు తెలిపారు. స్కూటీ వెనక కూర్చున్న డేనియల్ కు , లారీ డ్రైవర్ దరియావలికు స్వల్ప గాయాలయ్యాయి. సమా చారం అందుకున్న చిలకలూరిపేట 108 అంబులెన్స్ సిబ్బంది సంఘటనా స్థలానికి చేరుకొని లారీ డ్రైవర్ షేక్ దరియావలి, డేనియల్‌కు ప్రథమ చికిత్స చేసిన అనంతరం చిలకలూరిపేట ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మెరుగైన వైద్యం కోసం వారిని గుంటూరు ప్రభుత్వ ఆసుపత్రికి పంపారు. కేసు నమోదు చేసి విచారిస్తున్నట్లు ఎస్.ఐ. పుల్లారావు తెలిపారు. చేతి కంది వచ్చిన కుమారుడు చనిపోవడంతో తల్లిదండ్రులు ఓదార్చడం ఎవరి తరం కాలేదు.





కాల్వలో గుర్తుతెలియని వ్యక్తి కళేబరం

ప్రజాశక్తి దుగ్గిరాల

కృష్ణ పశ్చిమ డెల్టా ప్రధాన కాలువ బకింగ్ హామ్ కెనాల్ లో మోరంపూడి పెట్రోల్ బంక్ సమీపంలో గుర్తు తెలియని వ్యక్తి కళేబరాన్ని స్థానికులు కనుగొన్నారు. మృతుడికి సుమారు 50 సంవత్సరాల పైబడి ఉండ వచ్చునని భావిస్తున్నారు. ఒంటిపై బ్లూ, ఎరుపు రంగు గళ్ళ చొక్కా, బ్లూ కలర్ ప్యాంట్ ధరించి ఉన్నాడు. తల, మొండెం మొండము వేరై, చర్మం మొత్తం ఊడిపోయి ఉంది. మోరంపూడి విఆర్ఓ దేవరపల్లి రత్నకుమారి ఫిర్యాదు మేరకు దుగ్గిరాల ఎస్సై బి బ్రహ్మయ్య కేసు నమోదు చేసి మృతదేహాన్ని తెనాలి ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు.

ప్రముఖ రచయిత్రి తేజోవతికి నివాళి

ప్రజాశక్తి-గుంటూరు



తేజోవతి భౌతికకాయం వద్ద నివాళులర్పిస్తున్న వల్లంరెడ్డి లక్ష్మణరెడ్డి

ప్రముఖ రచయిత్రి అధారపురపు తేజోవతి భౌతిక కాయాన్ని జన చైతన్య వేదిక రాష్ట్ర అధ్యక్షులు వల్లంరెడ్డి లక్ష్మణరెడ్డి సోమవారం సందర్శించారు. స్థానిక బ్రాడీపేటలోని స్వగృహానికి వెళ్లి ఆమె భౌతిక కాయానికి నివాళులర్పించారు. ఆదర్శ అధ్యాపకురాలుగా, సామాజిక సేవా తత్పురాలుగా, ప్రముఖ రచయిత్రిగా పేరు ప్రతిష్టలు పొందిన తేజోవతి మృతిపై లక్ష్మణరెడ్డి ప్రగాఢ సంతాపం తెలిపారు. తేజోవతి కుమారులు కిస్మత్ కుమార్‌ను, కుటుంబ సభ్యులను పరామర్శించారు. 1920వ దశాబ్దంలో బాలికల విద్యా కోసం ఉన్నవ లక్ష్మీబాయమ్మ ప్రారంభించిన శారదానికేతన్ విద్య సంస్థ అభివృద్ధికి తేజోవతి అవిరళ కృషి చేశారు.

చిరుధాన్యాల వంటకాలతో రుచి, ఆరోగ్యం

ప్రజాశక్తి-గుంటూరు

కొర్నెపాడులోని కర్షక్ సేవా కేంద్రంలో రైతు నేస్తం ఫౌండేషన్ ఆధ్వర్యంలో మూడురోజులుగా చిరుధాన్యాలతో వంటకాల తయారీ విధానంపై జరుగుతున్న శిక్షణా కార్యక్రమం సోమవారం ముగిసింది. ఈ సందర్భంగా ముఖ్య అతిథిగా పాల్గొన్న చిరుధాన్యాల వంటకాల నిపుణులు హైమాకిరణ్ మాట్లాడుతూ చిరుధాన్యాలతో పోల్చుకుంటే వరి, గోధుమలలో పోషకాలు తక్కువని చెప్పారు. రోగాల బారిన పడకుండా ఉండాలంటే సరైన ఆహారం చిరుధాన్యాలని చెప్పారు. చిరుధాన్యాలు రుచిగా ఉండవు అనేది అపోహే అన్నారు. సక్రమంగా వంట చేసుకున్నట్లయితే చిరుధాన్యాలతో రుచి మరియు ఆరోగ్యం ఉంటుందన్నారు.కార్యక్రమంలో అనురాధ, చిరుధాన్యాల నిపుణులు మిల్లెట్ రాంబాబు, రైతునేస్తం ఫౌండేషన్ చైర్మన్ వై.వేంకటేశ్వరరావు పాల్గొన్నారు.ఈ సందర్భంగా చిరుధాన్యాలతో మిల్లెట్ కొబ్బరి అన్నం, మిల్లెట్ బిర్యాని, పులిహోర మసాలా, మిల్లెట్ పులిహోర వంటి రకరకాల ఆహార పదార్థాల తయారీపై శిక్షణ ఇచ్చారు.



మాట్లాడుతున్న హైమాకిరణ్



సమస్యాత్మక గ్రామాలలో కేంద్ర బలగాల కవాతు

ప్రజాశక్తి -నూజెండ్ల

నూజెండ్ల మండలంలోని కొన్ని సమస్యాత్మక సోమవారం కేంద్రబలగాలచే వినుకొండ రూరల్ ఇన్స్పెక్టర్ సీఐ సుధాకర్ రావు మరియు అయినవోలు ఎస్సై లక్ష్మీనారాయణ రెడ్డి ఆధ్వర్యంలో కేంద్ర బలగాలచే కంభంపాడు పమిడిపాడు ముతరాసువారిపలెం గ్రామాలలో కవాతు నిర్వహించారు ఎన్నికల ప్రశాంతంగా జరిగేలా ప్రతి ఒక్కరు సహకరించాలని గ్రామ ప్రజలను మరియు రాజకీయ నాయకులను కోరారు ఎటువంటి సంఘటనలు జరగకుండా అన్ని జాగ్రత్తలు తీసుకున్నట్లుగా తెలిపారు.

శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తే చర్యలు

ప్రజాశక్తి -దుర్గి



దుర్గి మండలంలోని జంగవేంశ్వరపాడు, ఆత్మకూరం, ధర్మవరం, శ్యామరాజపురం గ్రామాలలో సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో ప్రశాంతమైన వాతావరణం లో ఎన్నికల నిర్వహణ కోసం కారంపూడి రూరల్ సిఐ చిన్న మల్లయ్య, ఆధ్వర్యంలో కవాతు నిర్వహించారు. శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని గ్రామాల్లో ప్రశాంతంగా ఎన్నికలు నిర్వహించుకోవాలని, అసాంఘిక కార్యక్రమాలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని దుర్గి ఎస్సై కోటయ్య హెచ్చరించారు. ఆయా గ్రామాల రాజకీయ నాయకులతో సమావేశం నిర్వహించారు.



మిర్చి నిల్వలు

	బ్యాగులు
మిర్చి దిగుమతి	: 1,21,030
మిర్చి ఎగుమతి	: 1,14,869
మిర్చి నిల్వ	: 79,882

మిర్చి ధరలు

	రూపాయలలో
334	8,000 - 19,000
నెం.5	12,000 - 14,000
273	10,000 - 12,500
341	9,000 - 18,000
4884	10,500 - 17,500
	నాన్ ఎసి
తేజ	8,500 - 21,000
బడిగి	8,500 - 20,000
దేవనూరు డీలక్స్	12,000 -18,000
తాలుకాయలు	5,000 - 11,500

ఎండ సెగలు కక్కుతున్నా జాడలేని చలివేంద్రాలు

ప్రజాశక్తి - చిలకలూరిపేట


రద్దీగా ఉండే కళామందిర్ సెంటర్

వేసవి నేపథ్యంలో రెండు వారాల నుండి ఎండల తీవ్రత పెరిగింది. ఉదయం 10 గంటల నుండే అధిక ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. తాగునీరు ఎక్కువగా తాగాల్సిన ఈ సమయంలో మున్సిపాల్టీ తన బాధ్యతలను విస్మరించింది. పట్టణంలోని మున్సిపల్ కార్యాలయంతోపాటు ప్రధాన కూడళ్లలో ప్రతిఏటా మున్సిపాల్టీ ఆధ్వర్యంలో చలివేంద్రాలు ఏర్పాటు చేసేవారు. అయితే ప్రస్తుతం ఆ చర్యలేమీ లేవు. దీంతో గొంతు తడవాలంటే జేబు తడుముకోవాల్సి పరిస్థితి సామాన్యులకు దాపురించింది. పట్టణం చుట్టుపక్కల ప్రాంతాల నుండి వివిధ రోజువారీ కూలి పనుల కోసం వేలాది మంది చిలకలూరిపేటకు వస్తుంటారు. రాకపోకల సందర్భంలో, బస్సుల కోసం నిరీక్షించే సమయంలో వీరికి దాహమేస్తే కూలిడబ్బులతో నీరు కొనుక్కోవాల్సి వస్తోంది. ఉదయం పూట పనులకు వెళ్లే సందర్భంలో ఛార్జీ డబ్బులతోనే వచ్చే కూలీలు నీరు కొనుక్కోవడానికి కొన్ని సందర్భాల్లో డబ్బుల్లేక గొంతు ఎండబెట్టుకుంటున్నారు. గతంలో గడియార స్తంభం, కళామందిర్ సెంటర్, ఎన్ఆర్‌టి సెంటర్ తదితర ప్రాంతాల్లో చలివేంద్రాలు పెట్టేవారు. బస్సులు ఎక్కిదిగడానికి కూడా ఇవే ప్రధాన కూడళ్లు కావడంతో ఎండల్లో నిరీక్షించే ఎక్కువ మందికి చలివేంద్రాలు గొంతు తడిపేవి. దీనిపై మున్సిపల్ అధికారులు, ప్రజాప్రతినిధులు సత్వరం స్పందించాలని ప్రజలు కోరుతున్నారు.

అబ్దుల్లాకు 'ఫినిష్ మెడల్'

ప్రజాశక్తి - వినుకొండ



విజయవాడలో డెకల్లాస్ కంపెనీ ఆధ్వర్యంలో సోమవారం నిర్వహించిన అహింస 5 కిలోమీటర్ల పరుగు పందెంలో వినుకొండకు చెందిన షేక్ అబ్దుల్లా ఫినిష్ మెడల్ సాధించారు. విజయవాడ డిసిపి అధిరాజ్ సింగ్ నుండి పతకాన్ని అందుకున్నారు. అబ్దుల్లా జిల్లా, రాష్ట్ర, జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో ఎన్నో పతకాలు, సాధించినందుకు సంతోషంగా ఉందని డిసిపి అభినందించారు. ఈ ఏడాది జరగబోయే ఒలింపిక్ పోటీల్లో పాల్గొనబోతున్న అబ్దుల్లాకు శుభాకాంక్షలు తెలిపారు.

కుట్ర చేసి పింఛను ఆపారు : వైసిపి

ప్రజాశక్తి - నకరికల్లు

టిడిపి అధినేత చంద్రబాబు, మాజీ ఎన్నికల కమిషనర్ నిమ్మగడ్డ రమేష్ కుమార్ కుట్రల వల్లే ఒకటో తేదీన అందాల్సిన సామాజిక పింఛను ఆగిందని వైసిపి మండల కన్వీనర్ భవనం రాఘవరెడ్డి విమర్శించారు. ఈ మేరకు సోమవారం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ సామాజిక పెన్షన్లు పంపిణీ విధులు నుండి వాలంటీర్లను తప్పించాలని ఎన్నికల కమిషన్‌కు రమేష్‌కుమార్ ఫిర్యాదు చేయడంతో ఎన్నికల కమిషన్ వాలంటీర్లను ఆ విధులు నుండి తప్పించిందని అన్నారు. ప్రతినెలా ఒకటవ తేదీన ఉదయాన్నే పెన్షన్ తీసుకునే అవ్వ తాతలు, వికలాంగులు, ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు ఏప్రిల్ ఒకటవ తేదీన పెన్షన్ రాకపోవడంతో తీవ్రంగా ఇబ్బందులు పడుతున్నారని, ఇదంతా చంద్రబాబు కుట్రేనని విమర్శించారు. వైఎస్ జగన్‌కు మంచి పేరు రాకుండా చేయడమే చంద్రబాబు లక్ష్యమన్నారు. అవ్వ,తాతలే, కాకుండా ప్రతి ఒక్కరు రాబోయే ఎన్నికల్లో రాష్ట్రంలోని దుష్ట కూటమికి బుద్ధి చెప్పాలన్నారు.

సచివాలయాల్లోనే పింఛన్లు

ప్రజాశక్తి - రెంటచింతల

ఎన్నికల కోడ్ అమలులో ఉన్నందున పింఛన్ దారులుకు ఏప్రిల్ మూడవ తేదీ నుంచి సచివాలయాలలోనే అందజేయాలని ఎన్నికల ప్రవర్తన నియమావళి అమలు అధికారి శంకర్రావు ఆదేశించారు. సోమవారం సచివాలయ సిబ్బందితో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ 269 మంది వాలంటీర్లు నుంచి సెల్ ఫోను, సిమ్ములు, బయోమెట్రిక్ వెనక్కి తీసుకున్నామన్నారు ఎన్నికలు ముగిసిన మూడు నెలలు వరకు గ్రామ సచివాలయ అధికారులతో పింఛన్లు అందజేస్తామన్నారు మండలంలోని 11 గ్రామాల్లో బుధవారం నుంచి పింఛన్లు పంపిణీ చేయాలన్నారు.

అంకితభావంతో పనిచేస్తే గుర్తింపు

ప్రజాశక్తి-విజయపురిసౌత్

విధి నిర్వహణలో అంకిత భావంతో పనిచేస్తే మంచి గుర్తింపు లభిస్తుందని పర్యాటక శాఖ విజయవాడ డివిజనల్ మేనేజర్ కృష్ణ చైతన్య అన్నారు. ఆదివారం రాత్రి విజయపురిసౌత్‌లోని ఏపీ పర్యాటక శాఖ లాంచీ స్టేషన్‌లో బోట్ డ్రైవర్‌గా పనిచేసి ఉద్యోగ విరమణ పొందిన కెవి ప్రభాకర్‌రావు సన్మాన కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ప్రభాకర్‌రావు సుదీర్ఘ కాలం పాటు బోట్ డ్రైవర్‌గా నిబద్ధతతో పనిచేశారని అభినందించారు. అనంతరం ప్రభాకర్‌రావు దంపతులను ఉద్యోగులు సన్మానించారు. లాంచీ స్టేషన్ మేనేజర్ శివారెడ్డి, హరిత రిసార్ట్ మేనేజర్ శ్రీనివాస్, అడ్మిన్ ఆఫీసర్ శ్రీధర్, అకౌంటెంట్ వెంకటేశ్వర్లు, పి.వీరారెడ్డి, భైరవ స్వామి, వినయతుల్లా, దత్తు పాల్గొన్నారు.



బ్రహ్మనాయుడుపై ఎన్నికల సంఘానికి ఫిర్యాదు : జీవీ

ప్రజాశక్తి - వినుకొండ


విలేకర్లతో మాట్లాడుతున్న జీవీ ఆంజనేయులు, మక్కెన

ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు బూతునామాలపై ఎన్నికల సంఘానికి ఫిర్యాదు చేస్తామమని కూటమి తరుపున వినుకొండ ఎమ్మెల్యే అభ్యర్థి జీవీ ఆంజనేయులు అన్నారు. ఎమ్మెల్యే వ్యాఖ్యలను ఖండిస్తూ మాజీ ఎమ్మెల్యే మక్కెన మల్లికార్జునరావుతో కలిసి సోమవారం విలేకర్లతో మాట్లాడారు. బ్రహ్మనాయుడు తరహాలో బూతులు తిట్టిన ఎమ్మెల్యే చరిత్రలో లేరన్నారు. అవినీతి చేసి రూ.కోట్లు సంపాదించడానికి బొల్లా ఎంచుకున్న దారులన్నీ మూసుకుపోతుంటే ఉక్రోషం పట్టలేక ఇష్టానుసారం మాట్లాడుతున్నారని అన్నారు. ఈ శునక గర్జనలతో ఏం సాధించాలని అనుకుంటున్నారో చెప్పాలన్నారు. గుండ్లకమ్మపై తంగిరాల డ్యామ్ నిర్మిస్తానని చెప్పి మోసం చేశారని, 14 కళాశాలలు తీసుకొస్తానని చెప్పి ఒక్కటీ తేలేదని, వినుకొండను పారిశ్రామికవాడను చెస్తామని చెప్పి ఒక్క పరిశ్రమైనా తెచ్చారా? అని ప్రశ్నించారు. గోదావరి-పెన్నా నదుల అనుసంధానం గురించి ఎమ్మెల్యే ఎప్పుడైనా మాట్లాడారా? అని, నీటిపారుదల శాఖ మంత్రిగా చేసిన అనిల్‌కుమార్ యాదవ్ ఈ ప్రాజెక్టుకు ఒక్క రూపాయి కూడా ఎందుకు ఇవ్వలేదని నిలదీశారు. 6న వినుకొండలో జరిగే ప్రజాగళం సభలో చంద్రబాబు పాల్గొంటారని తెలిపారు. మక్కెన మల్లికార్జునరావు మాట్లాడుతూ బొల్లా చేసిన అభివృద్ధి ఏమిటి? అరాచకాలెన్ని? అనే విషయంపై తాము ఎప్పుడైనా బహిరంగ చర్చకు సిద్ధమన్నారు. ఈ వయసులో అనవసరంగా బీపీ తెచ్చుకొని ఇబ్బంది పడవద్దని హితవు పలికారు. తనపై ఆరోపణలు చేస్తున్నారని, తప్పు చేసి ఉంటే కేసు పెట్టి జప్తు చేయించవచ్చు కదా? అని అన్నారు. 40 ఏళ్ల నుంచి చేపల చెరువులను లీజుకు తీసుకొని నడుపుతున్నా వివాదాలు రాలేదని, బ్రహ్మనాయుడు ఎమ్మెల్యే అయ్యాక ఆ చెరువులను ఒక్కొక్కటిగా వదులుకుంటూ వచ్చామని చెప్పారు. తిరుమల డెయిరీకి తామంతా పాలుపోస్తే శాతాలు తగ్గించి మోసం చేశారని, లారీ డ్రైవర్‌గా, సినిమాలు వేసుకునే బొల్లా అపర కోటేశ్వర్లు ఎలా అయ్యారని ప్రశ్నించారు. టిడిపి ప్రభుత్వం వచ్చిన తర్వాత ఎమ్మెల్యే బొల్లాకి చెందిన వెయ్యి ఎకరాల్లో ఏముందో, తన 50 ఎకరాల్లో ఏముందో, ఆంజనేయులు 50 ఎకరాల్లో ఏముందో సర్వే జరుగుతుందని, అసైన్డ్ భూములు, ప్రభుత్వ భూములేమైనా ఉన్నట్లు తేలితే పేదలకు పంచుతామని ప్రకటించారు. కార్యక్రమంలో జనసేన నియోజక సమన్వయకర్త కె.నాగశ్రీను రాయల్, టిడిపి నాయకులు పి.నాగేశ్వరరావు, షమీంఖాన్, పి.పూర్ణచంద్రరావు, బి.సైదులు పాల్గొన్నారు.

నేటి నుండి పాలీసెట్ ఉచిత శిక్షణ

ప్రజాశక్తి-పిడుగురాళ్ల

ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ (యుటిఎఫ్), భారత విద్యార్థి ఫెడరేషన్ (ఎస్ఎఫ్ఐ) జన విజ్ఞాన వేదిక (జెవివి) ఆధ్వర్యంలోపాలిటెక్నిక్ ఉచిత శిక్షణ తరగతులను పట్టణంలోని మన్నెం పుల్లారెడ్డి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మంగళవారం నుండి ప్రారంభిస్తున్నట్లు ఎస్ఎఫ్ఐ పల్నాడు జిల్లా అధ్యక్షులు కోటా సాయికుమార్, యుటిఎఫ్ మండల కార్యదర్శి దొంతగాని శ్రీనివాసరావు సోమవారం తెలిపారు. ప్రారంభోత్సవానికి ఉమ్మడి కృష్ణా-గుంటూరు జిల్లాల పట్టభద్రుల నియోజకవర్గ ఎమ్మెల్సీ కెఎస్ లక్ష్మణరావు, యుటిఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు ఎన్.వెంకటేశ్వర్లు, మన్నెం పుల్లారెడ్డి జెడ్‌పి పాఠశాల హెచ్ఎం ఎల్.ధనలక్ష్మి హాజరై ప్రారంభిస్తారని చెప్పారు. యుటిఎఫ్ పల్నాడు జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు పి.ప్రేమ్‌కుమార్, జి.విజయసారథి, జిల్లా నాయకులు పాల్గొంటారని చెప్పారు. పదో తరగతి పరీక్షలు రాసిన విద్యార్థులు ఈ అవకాశాన్ని ఉపయోగించుకోవాలని, శిక్షణ పొంది పోటీ పరీక్షలో మంచి ర్యాంకు సాధించాలని సూచించారు. గతేడాది కూడా సుమారుగా 150 మంది విద్యార్థులు ఉచితంగా పాలీసెట్ శిక్షణ తీసుకున్నారని, పరీక్షలో మెరుగైన ర్యాంకులు సాధించి ప్రభుత్వ, ప్రైవేటు కళాశాలల్లో ఉచితంగా సీట్లు పొందారని చెప్పారు. వివరాల కోసం 9963581758, 9949934068, 7799334980 ఫోన్ నంబర్లకు సంప్రదించాలని సూచించారు.

జవహర్ నవోదయకు ఏడుగురు కేరళమోడల్ స్కూల్ విద్యార్థులు

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా


ఎంపికైన వారిని అభినందిస్తున్న ఎంఇఒ

ఆదివారం విడుదలైన జవాహర్ నవోదయ ఫలితాల్లో తమ పాఠశాలకు చెందిన ఏడుగురు విద్యార్థులు ఎంపికయ్యారని కేరళ మోడల్ స్కూల్ డైరెక్టర్ గెల్లి గాలిరెడ్డి సోమవారం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ ఏడాది జనవరి 21న జవహర్ నవోదయం 6వ తరగతి ప్రవేశ పరీక్షలకు మండల కేంద్రమైన రొంపిచర్లలోని గోగులపాడు రోడ్డులో గల కేరళ మోడల్ స్కూల్ విద్యార్థులు 20 మంది హాజరుకాగా వీరిలో ఫణిదపు రేవతి, కోట ప్రసిద్ధి, నంబూల సుప్రియ, పుల్లగూర జెనివా, మాణిక్యారావు, మేరీ జోష్‌బాబు, విష్ణుతేజ సీట్లు సాధించారని చెప్పారు. గత 5 ఏళ్లలో తమ పాఠశాలకు చెందిన 32 మంది విద్యార్థులు జవహర్ నవోదయకు ఎంపికయ్యారని, 5 తరగతి విద్యార్థులకు జవహర్ నవోదయ ఎంపికకు సంబంధించి ప్రత్యేక శిక్షణిస్తున్న నేపథ్యంలో తమ విద్యార్థులు ప్రతి ఏడాది ఆరుగురికి పైగా ఎంపికవుతున్నారని చెప్పారు. ఎంపికైన వారిని గాలిరెడ్డితోపాటు ఎంపిఇఒ బ్రహ్మేశ్వరరావు, ఎంఐసి కో-ఆర్డినేటర్ పచ్చవ రామకృష్ణ, గ్రామ పెద్దలు అభినందించారు.



ఇళ్లకు అంటించిన స్టిక్కర్ల తొలగింపు

ప్రజాశక్తి - చిలకలూరిపేట

పట్టణంలో వైసిపి నాయకులు ఎన్నికల కోడ్ ఉల్లంఘిస్తు ప్రచారం చేస్తున్నారని ప్రముఖ న్యాయవాది మడవ వెంకట్రావు సి విజిల్ యాప్ ద్వారా సోమవారం ఫిర్యాదు చేశారు. దీంతో ఫ్లయింగ్ స్క్వాడ్ సిబ్బంది స్థానిక 9వ వార్డులో పరిశీలించి ఇళ్లకు అంటించిన స్టిక్కర్లను తొలగించారు.

ఎన్నికల శిక్షణకు తప్పనిసరిగా హాజరవ్వాలి : కలెక్టర్

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా



ఎన్నికల శిక్షణకు పోలింగ్ సిబ్బంది తప్పనిసరిగా హాజరుకావాలని, ఈ విషయమై సంబంధిత రిటర్నింగ్ అధికారులు పోలింగ్ సిబ్బంది తప్పనిసరిగా హాజరయ్యేలా చొరవ చూపాలని పల్నాడు జిల్లా కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి ఎల్.శివశంకర్ ఆదేశించారు. జిల్లా కేంద్రమైన నరసరావుపేట కలెక్టరేట్‌లో ఎన్నికల నోడల్ అధికారులు, రిటర్నింగ్ అధికారులతో సోమవారం సమావేశమయ్యారు. పోలింగ్ సిబ్బందికి ఎన్నికల శిక్షణివ్వడం ద్వారా కొన్ని లోపాలను అధిగమించేందుకు అవకాశం ఉంటుందన్నారు. పోలింగ్ సిబ్బంది పోస్టల్ బ్యాలెట్ కోసం అవసరమైన ఫామ్-12ను పూర్తి చేసుకుని తీసుకుని శిక్షణకు వచ్చేలా రిటర్నింగ్ అధికారులు స్పష్టంగా తెలపాలని చెప్పారు. ఎన్నికల సిబ్బందికి శిక్షణ కార్యక్రమాలు సజావుగా జరుగుతున్నాయా అనేది రిటర్నింగ్ అధికారులు పరిశీలించాలన్నారు.

ఇండియా వేదిక అభ్యర్థుల గెలుపునకు కృషి చేయాలి

ప్రజాశక్తి-తాడేపల్లి


కాంగ్రెస్‌పార్టీ నాయకుల్ని కలిసిన సిపిఎం నాయకులు

మంగళగిరిలో ఇండియా వేదిక తరపున ఎమ్మెల్యే అభ్యర్థిగా పోటీ చేస్తున్న వామపక్ష అభ్యర్థికి మద్దతు ఇవ్వాలని సోమవారం సిపిఎం నాయకులు కాంగ్రెస్ పార్టీ నాయకులను మద్దతు కోరారు. ఇండియా వేదిక అభ్యర్థులను గెలిపించుకోవడానికి కలిసికట్టుగా పని చేద్దామని కాంగ్రెస్ నాయకులు హామీనిచ్చారు. ఈ సందర్భంగా సిపిఎం సీనియర్ నాయకులు జొన్నా శివశంకరరావు మాట్లాడుతూ ప్రజలు కష్టాల్లో ఉంటే వారి తరపున నికరంగా నిలబడేది కమ్యూనిస్టులేనని చెప్పారు. పదవులే పరమార్ధంగా భావించే వారికి ఓటు వేస్తే కష్టాలు తప్పవన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పెట్రోల్, డీజిల్, గ్యాస్ ధరలు పెంచడంతో పాటు ఇంటి పన్ను, చెత్త పన్ను, విద్యుత్ ఛార్జీల పేరుతో ప్రజలపై మోయలేని భారాలు మోపుతున్నారని విమర్శించారు. ఇండియా వేదిక నుంచి మంగళగిరి నుంచి పోటీ చేస్తున్న తనకు ఓట్లు వేసి గెలిపించాలని కోరారు. ఉండవల్లి సర్పంచ్‌గా గ్రామాభివృద్ధికి కృషి చేసినట్లు చెప్పారు. తనకు ఓటు వేసి గెలిపిస్తే అందరికీ అందుబాటులో ఉండి ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని అన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఎం రాజధాని డివిజన్ కార్యదర్శి ఎం.రవి, నాయకులు వల్లభాపురం వెంకటేశ్వరరావు. టి.బక్కిరెడ్డి, కె.రామకృష్ణ, కాంగ్రెస్‌పార్టీ నాయకులు గాదే పోతురాజు, ఏపూరి ఆదెయ్య, దాసరి నాగయ్య, సిహెచ్ వాసు, సిహెచ్ జనార్ధన్, జి ప్రభాకరరావు, పి వీరాస్వామి పాల్గొన్నారు.

మతోన్మాద బిజెపిని ఓడించాలి

ప్రజాశక్తి - మంగళగిరి


మాట్లాడుతున్నచంగయ్య

రానున్న సార్వత్రిక ఎన్నికల్లో మతోన్మాద బిజెపిని, దాని మిత్రపక్షాలను ఓడించాలని సిపిఎం గుంటూరు జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఎస్ ఎస్ చెంగయ్య పిలుపునిచ్చారు. మంగళగిరి సిపిఎం కార్యాలయంలో సోమవారం సాయంత్రం మంగళగిరి పట్టణ సిపిఎం కమిటీ సమావేశం జరిగింది. ఈ సమావేశానికి సిపిఎం పట్టణ నాయకులు టి శ్రీరాములు అధ్యక్ష వహించారు. చెంగయ తన ప్రసంగాన్ని కొనసాగిస్తూ కేంద్రంలోని నరేంద్ర మోడీ ప్రభుత్వాన్ని రాష్ట్రంలో ఉన్న వైఎస్ఆర్సిపి, టిడిపి, జనసేన పార్టీలు ఊడిగం చేస్తున్నాయని విమర్శించారు. రాష్ట్రానికి తీరని అన్యాయం చేస్తున్న నరేంద్ర మోడీ ప్రభుత్వాన్ని ప్రశ్నించే స్థితిలో వారు లేరని అన్నారు. ప్రజా సమస్యల పరిష్కారం కావాలంటే కమ్యూనిస్టులు చట్ట సభల్లోకి కార్మిక వర్గ ప్రజా ప్రతినిధులను గెలిపించుకోవడానికి కషి చేయాలని కోరారు. ఈ సమావేశంలో సిపిఎం సీనియర్ నాయకులు జెవి రాఘవులు, పి బాలకష్ణ, సిపిఎం పట్టణ కార్యదర్శి వై కమలాకర్, వర్గ సభ్యులు వివి జవహర్లాల్, ఎం బాలాజీ, పట్టణ నాయకులు ఎం చలపతిరావు, ఎస్ గణేష్, జి దుర్గాప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

ముఠాకార్మికులతో విస్తృత సమావేశం

ప్రజాశక్తి - తాడేపల్లి :రానున్న ఎన్నికల్లో ఇండియా బ్లాక్ అభ్యర్థులుగా పోటీ చేస్తున్న వారిని గెలిపించాలని, బ్లాక్ తరుపున మంగళగిరి అసెంబ్లీ నియోజకవర్గం నుండి సిపిఎం అభ్యర్థిగా పోటీ చేస్తున్న జొన్న శివశంకరరావును గెలిపించుకోవాలని ముఠా కార్మికులు తీర్మానించారు. ఈ మేరకు పట్టణంలోని టిటి యార్డులో ముఠామేస్త్రి జి.శ్రీనివాసరావు అధ్యక్షతన కార్మికుల విస్తృత సమావేశం సోమవారం జరిగింది. ఈ సందర్భంగా అభ్యర్థి జొన్న శివశంకరరావు మాట్లాడుతూ ముఠా కార్మికులకు సమగ్ర చట్టం చేయాలని, ఇఎస్ఐ, పిఎఫ్ సౌకర్యం కల్పించాలని కోరారు. కార్మిక సంక్షేమ బోర్డు ఏర్పాటు చేసి ఆ నిధులను కార్మికుల కోసమే ఖర్చు చేయాలని డిమా ండ్ చేశారు. ప్రభుత్వాలు ముఠా కార్మికుల సంక్షేమ బోర్డు నిధులను పక్కదారి పట్టించాయని విమర్శించాఉ. సిపిఎం పట్టణ నాయకులు వి.దుర్గారావు మాట్లాడుతూ కార్మికులు పోరాడి సాధించకున్న చట్టాలను కేంద్రంలోని మోడీ ప్రభుత్వం నిరకుశంగా రద్దు చేసి నాలుగు లేబర్ కోడ్‌లు తెచ్చిందని అన్నారు. యజమానులకు అనుకూలంగా చట్టాలను మార్చడంతోపాటు కార్మికులను బానిసలుగా చేయబూనుకుందని మండిపడ్డారు. కార్మిక హక్కుల కోసం నిలబడే సిపిఎం అభ్యర్థిని గెలిపించాలన్నారు. ఇదిలా ఉండగా బోర్డు యార్డు వద్ద సిపిఎం విస్తృత సమావేశం కె.మేరి అధ్యక్షతన నిర్వహించగా నాయకులు డి.శ్రీనివాసకుమారి, పి.గిరిజ మాట్లాడారు. మహిళల హక్కులు, సంక్షేమం కోసం పనిచేసే ఇండియా వేదిక అభ్యర్థులను రానున్న ఎన్నికల్లో గెలపించుకోవాలని కోరారు. సమావేశాల్లో సిపిఎం తాడేపల్లి రూరల్ కార్యదర్శి డి.వెంకటరెడ్డి నాయకులు వి.సామ్యేలు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న శ్రీనివాసకుమారి


మాట్లాడుతున్న జొన్నా శివశంకరావు

అమరావతి రైతులకు సన్మానం

ప్రజాశక్తి-గుంటూరు

రాజధాని కోసం సారవంతమైన వేలాది ఎకరాలు అందజేసిన రైతుల త్యాగం అజరామరం అని రైతు నాయకురాలు డాక్టర్ రాయపాటి శైలజ పేర్కొన్నారు. సోమవారం స్థానిక బృందావన్ గార్డెన్స్, వెంకటేశ్వర స్వామి దేవస్థానం, అన్నమయ్య కళావేదికపై గుళ్ళపల్లి సుబ్బారావు సేవా సంస్థ ఆధ్వర్యంలో రాజధాని నిర్మాణానికి స్వచ్ఛందంగా భూమిని ప్రభుత్వానికి అందజేసిన వేలాదిమంది రైతుల తరపున రైతు నాయకులు డాక్టర్ వజ్జా రామలింగయ్య, విధ్వంసం పుస్తక రచయిత ఆలపాటి సురేష్, అమరావతి పరిరక్షణ సమితి అధ్యక్షులు ఆళ్ళ శివారెడ్డి, రైతు మహిళా నాయకురాలు కంభంపాటి శిరీషను ఘనంగా సత్కరించారు. కాకతీయ కన్వెన్షన్ సొసైటీ అధ్యక్షులు డాక్టర్ యర్ర నాగేశ్వరరావు సభకు అధ్యక్షత వ్యవహరించగా డాక్టర్ శైలజ మాట్లాడుతూ గత ఐదేళ్లుగా రాష్ట్ర ప్రభుత్వం రాజకీయ ప్రేరేపితంతోనే అమరావతి రాజధానిని సర్వనాశనం చేశారని ఆవేదన వ్యక్తం చేశారు. త్వరలో మంచి రోజులు వస్తున్నాయన్నారు. కార్యక్రమంలో దేవస్థానం పాలకమండలి అధ్యక్షులు చిట్టిపోతు మస్తానయ్య, డాక్టర్ చిట్టినేని శివ కోటేశ్వరరావు, గుళ్ళపల్లి సుబ్బారావు సేవా సంస్థ కన్వీనర్ గొల్లపల్లి రాఘవేంద్రరావు, రైతు ఉద్యమ నాయకులు జమ్ముల శ్యామ్ కిషోర్, స్వరాజరావు, యుగంధర్ తదితరులు పాల్గొన్నారు.


రైతు నాయకుల్ని సత్కరిస్తున్న డాక్టర్ శైలజ

రేపు తెనాలిలో పవన్ కల్యాణ్ పర్యటన

సభ ఏర్పాటు పరిశీలించిన నాదెండ్ల మనోహర్

ప్రజాశక్తి-తెనాలి

సార్వత్రిక ఎన్నికల శంఖారావానికి ఈనెల 3న తెనాలి రానున్న జనసేన అధినేత పవన్ కల్యాణ్ పర్యటన విజయవంతం చేయాలని ఆ పార్టీ పిఏసి చైర్మన్ నాదెండ్ల మనోహర్ కోరారు. స్థానిక సుల్తానా బాద్‌లో పవన్ కల్యాణ్ పర్యటన నిమిత్తం హెలిప్యాడ్ ఏర్పాట్లను సోమ వారం పరిశీలించారు. అనంతరం బోస్‌రోడ్డులోని పార్టీ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ పవన్ కల్యాణ్ సాయంత్రం నాలుగు గంటలకు హెలికాప్టర్ ద్వారా చెంచుపేటకు చేరుకుంటారన్నారు. అక్కడి నుంచి వారాహి వాహనంపై రోడ్‌షోలో సాయంత్రం ఆరుగంటలకు మార్కెట్ కూడలిలోని పురవేదిక వద్ద బహిరంభ పభలో పాల్గొంటారన్నారు. జనసేన, టిడిపి, బిజెపి ఉమ్మడి ఎన్నికల మేనిఫెస్టోలో మహిళలు, కౌలు రైతుల కోసం పొందుపరచిన అంశాలను, అలాగే తెనాలి ప్రాంతంలో అభివృద్ధి ప్రణాళికను పవన్ వివరిస్తారన్నారు. టిడిపి, జనసేన, బిజెపి శ్రేణులను సభకు ఆహ్వానిస్తున్నామని, అంతా కలిసి పవన్ కల్యాణ్ పర్యటనను విజయవంతం చేయాలన్నారు. ఇదిలా ఉంటే అధికార వైసిపి పెన్షన్ల పంపిణీ విషయంలో ప్రతిపక్షాలపై బురద చల్లే ప్రయత్నాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. ఎన్నికల కోడ్ అమల్లోకి వచ్చిన తరువాత ఇటీవల విజయవాడలో పర్యటించిన ఎన్నికల కమిషన్ బృందం జిల్లా కలెక్టర్లు, ఎస్పీలతో చర్చించి ఎన్నికల విధుల్లో వాలంటీర్లు, కాంట్రాక్టు ఉద్యోగులకు అవకాశం లేదని స్పష్టం చేసిందన్నారు. అదే విధంగా ఈసి తీసుకున్న కొన్ని నిర్ణయాల్లో భాగంగా ప్రభుత్వ అధికారుల ద్వారా లబ్దిదారులకు సామాజిక భద్రతా పించన్లు పంపిణీ చేయాల్సి ఉందన్నారు. పెన్షన్ల పంపిణీ వైసిపి అధికారంలోకి వచ్చిన తరువాత వచ్చిన కొత్త పథకం ఏమీ కాదని, దామోదరం సంజీవయ్య ముఖ్యమంత్రిగా ఉన్నపుడే పెన్షన్ల పంపిణీకి రూపకల్పన జరిగిందని గుర్తు చేశారు. అధికార పార్టీ కుట్రపూరితంగా ప్రతిపక్షాలపై బురదజల్లటం మానుకుని, పంచాయతీరాజ్, రెవెన్యూ శాఖల సమన్వయంతో ఈనెల 3లోగా సామాజిక భద్రతా పించన్లు పంపిణీ చేయాలని, లేదంటే లబ్దిదారుల తరఫున అధికారులపై చర్యలకు ఈసిని ఆశ్రయిస్తామన్నారు. సమావేశంలో జనసేన జిల్లా పార్టీ అధ్యక్షులు గాదె వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.


హెలిప్యాడ్ నిర్మాణాన్ని పరిశీలిస్తున్న మనోహర్

బాలల కథా సంకలనానికి హకీంజానీ రచన ఎంపిక

ప్రజాశక్తి-తెనాలి



పట్టణానికి చెందిన బాలసాహితీవేత్త, ఫ్రీలాన్సర్ షేక్ అబ్దుల్ హకీంజాని 'నాలుగు గుండిగలు' శీర్షికన రచించిన కథ సారస్వత పరిషత్ ప్రతిష్టాత్మకంగా రూపొందిస్తున్న బాలల కథా సంకలనంలో ప్రచురణకు ఎంపికైంది. ఈ మేరకు సారస్వత పరిషత్ అధ్యక్ష, కార్యదర్శులు ఎల్లూరి శివారెడ్డి, డాక్టర్ జె.చెన్నయ్య నుంచి సమాచారం అందుకున్నట్లు హకీంజాని సోమవారం వెల్లడించారు. బాలల రచయితలు, బాల సాహితీవేత్తరు దాదాపుగా 317 కథలు ఈ సంకలనానికి పంపారని, వీటిలో 117కథలు బాలల కథా సంకలనానికి ఎంపికయ్యాయి. హకీంజాని వివిధ దినపత్రికలకు, మాసపత్రికలకు కవర్ పేజీ కథనాలు రాస్తుంటారు. బాలల సాహిత్యంలో బాల సాహితీరత్న, బాల నేస్తం పురస్కారాలను కూడా ఆయన అందుకున్నారు. సారస్వత పరిషత్ సంకలనానికి హకీంజాని రచించిన కథ ఎంపిక కావటం పట్ల ఆయనను పలువురు సాహితీ ప్రియులు అభినందించారు.

జాతీయ ఒలింపియాడ్‌లో నెహ్రూనికేతన్‌కు ర్యాంకులు

ప్రజాశక్తి-తెనాలి



విద్యార్థులను అభినందిస్తున్న మురళీకాంత్

న్యూఢిల్లీకి చెందిన సిల్వర్ జోన్ ఫౌండేషన్ జనవరిలో జాతీయ స్థాయిలో నిర్వహించిన రెండు ఒలంపియాడ్‌లలో బోస్ రోడ్డులోని నెహ్రూ నికేతన్ విద్యార్థు లు ర్యాంకులు సాధించారని పాఠశాల మేనేజింగ్ డైరెక్టర్ మురళీకాంత్ దాసరి సోమవారం వెల్లడించారు. టాలెంట్ హంట్ పేరుతో నిర్వహించిన ఒలంపియాడ్‌లో వి.దక్షిత, జి.హర్విన్ రాష్ట్ర స్థాయిలో ఆరు. 15 ర్యాంకులు సాధించి, బంగారు పతకాలు గెలుచుకున్నారని, సైన్స్ ఒలింపియాడ్‌లో సిహెచ్ ఈశ్వర్‌బాబు 203, సీహెచ్ జయశ్రీనివాస్ 303 ర్యాంకులు, షక్ సనా ఫాతిమా 358వ ర్యాంకు, బంగారు పతకాలు సొంతం చేసుకోగా, బి.దీపాల శ్రీసాత్విక 320, కాంస్య పతకం సాధించారు. సిల్వర్ జోన్ ఫౌండేషన్ పంపిన మెడల్స్, ప్రశంసాపత్రాలను మురళీకాంత్ విద్యార్థులకు అందించి, అభినందించారు. కార్యక్రమంలో విద్యార్థులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

విపత్తు నిర్వహణపై విద్యార్థులకు అవగాహన

ప్రజాశక్తి - తుళ్లూరు


శిక్షణ పొందుతున్న విద్యార్థులు



మండలం లోని నిర్మల ఇంగ్లీష్ మీడియం స్కూలు లో విద్యార్థులకు సోమవారం స్కౌట్స్ అండ్ గైడ్స్ సమ్మర్ అండ్ అడ్వెంచర్ క్యాంప్ నిర్వహించారు. ఈ క్యాంపులో విద్యార్థులకు విపత్తు నిర్వహణలో అనుసరించాల్సిన వివిధ నైపుణ్యాల కోసం అనుభవం కలిగిన సౌట్స్ మాస్టర్స్ అధ్వర్యంలో శిక్షణా కార్యక్రమం జరిగింది. సమాజ ఉన్నతికి, వ్యక్తిగత క్రమశిక్షణకు, విపత్తు నిర్వహణకు స్కౌట్స్ అండ్ గైడ్స్ శిక్షణ ఎంతో ఉపయోగ కరంగా ఉంటుందని కార్యక్రమాన్ని ప్రారంభించిన స్కూల్ హెచ్ ఎం సిస్టర్ బీనా జో సెఫ్, సమన్వయకర్త సిస్టర్ ఆగ్నేస్ అన్నారు. విద్యార్థులందరూ ఎంతో ఉత్సాహంగా ఈ కార్యక్రమంలో నిర్వహించిన పలు విభాగాల్లో పాల్గొన్నట్లు ముఖ్య అతిధిగా విచ్చేసిన హెచ్ ఎస్ జి రాష్ట్ర జనరల్ సెక్రెటరీ చెన్నారెడ్డి తెలిపారు. ఇతర ప్రాంతాలలోని పాఠశాల విద్యార్థులు కూడా ఉత్సాహంగా పాల్గొన్నారని, అందరికీ వారి వారి ప్రతిభను బట్టి గ్రేడ్ నిర్ణయించి తగు అర్హతా పత్రాలతో సత్కరిస్తామని కార్యక్రమ నిర్వహణ కమిటీ అధ్యక్షురాలు,హెచ్ ఎస్ జి జిల్లా ఆర్గనైజింగ్ కమిషన్ సభ్యులు బెల్లంకొండ స్వర్ణలత తెలిపారు.



పెన్షనర్స్ అసోసియేషన్ చలివేంద్రం ఏర్పాటు

ప్రజాశక్తి - దాచేపల్లి

మండలంలోని పెన్షనర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో సిపిఐ కార్యాలయం ఎదుట సోమవారం చలివేంద్రం ఏర్పాటు చేశారు. ఈ చలివేంద్రాన్ని సి.కోదండరామిరెడ్డి తిరణాల సత్య నారాయణ ప్రారంభించారు.ఈ సందర్భంగా కోదండరామిరెడ్డి మాట్లాడుతూ గత ఐదు సంవత్సరాల నుండి చలివేంద్రం ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో బి.కృష్ణారెడ్డి, ఎం.సాంబశివరావు, ఎస్. వీరాస్వామి, కె.నవజ్యోతి, వి.నాగేశ్వరరావు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న స్వర్ణాంధ్ర ఎమ్మార్పీఎస్ నాయకులు

జివి ఆంజనేయులుకి స్వర్ణాంధ్ర ఎమ్మార్పీఎస్ సంఘీభావం

ప్రజాశక్తి - వినుకొండ

స్థానిక క్రిస్టియన్‌పాలెంలోని ఎమ్మార్పీఎస్ కార్యాలయంలో మంగళవారం విలేకరుల సమావేశం నిర్వహించారు. స్వర్ణాంధ్ర ఎమ్మార్పీఎస్ నాయకులు గుంటూరు, పల్నాడు జిల్లాల ఇన్‌ఛార్జి మక్కెన ప్రభాకర్ మాట్లాడుతూ ఎమ్మెల్యే అభ్యర్థి జివి ఆంజనేయులుకి ఎమ్మార్పీఎస్ సంఘీభావం తెలుపుతున్నట్లు చెప్పారు. టిడిపి,జనసేన, బిజెపి కూటమి తరపున ఎన్నికల్లో పోటీ చేస్తున్న ఎంపి, ఎమ్మెల్యే అభ్యర్థులను రాష్ట్రంలోని మాదిగ, మాదిగ ఉపకులాల వారు గెలిపించాలని కోరారు. సమావేశంలో ఎం.శ్రీను, డి.కనకయ్య, ఎస్.ఏలియా, డి.లాజర్, ఎం.రాజు పాల్గొన్నారు.



రూ.1,25,000 రసికాడోట్రిల్ ప్యాకెట్లు వితరణ

ప్రజాశక్తి-సత్తెనపల్లి

ఆర్యవైశ్య యువ జన సంఘం గౌరవ అధ్యక్షులు కొత్త రామకృష్ణ ఆధ్వర్యంలో సత్తెనపల్లి గవర్నమెంట్ హాస్పిటల్ కి సుమారు లక్ష ఇరవై ఐదు వేల రూపాయలు విలువ చేసే రసికాడోట్రిల్ ప్యాకెట్లను చికిత్సలో ఉపయోగించే ప్యాకెట్లను రావిక్రింది మల్లికార్జున రావు (జనరల్ సెక్రటరి పల్నాడు డిస్ట్రిక్ట్ కెమిస్ట్ డ్రగ్గిస్ట్ అసోసియేషన్) సోమవారం డొనేషన్ గా అందించారు. ఈ సందర్భంగా హాస్పిటల్ సూపరింటెండెంట్ లక్ష్మణరావు మాట్లాడుతూ ఎండాకాలం చిన్న పిల్లల్లో డయే రియా ఎక్కువగా వస్తుందని అలాంటివారికి త్వరితగతిన తగ్గించడానికి ఈ మెడిసిన్ బాగా ఉపయోగ పడుతుందని చెప్పారు. కొత్త రామకృష్ణ మాట్లాడుతూ ఆర్యవైశ్య యువజన సంఘం తరుపున ఎన్నో సేవా కార్యక్రమాలు చేస్తూ ఉంటామని చెప్పారు. ఈ ప్యాకెట్లు డొనేట్ చేసిన మల్లికి ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో హాస్పిటల్ ఏవో భవాని, రావి క్రింది శ్రీధర్ పాల్గొన్నారు.

ఓటు హక్కుపై అవగాహన

ప్రజాశక్తి - నూజెండ్ల

మండలంలో ఓటు హక్కుపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు ఈ కార్యక్రమంలో ఓటు యొక్క విలువను, ఓటు వేయకపోతే జరిగే నష్టాన్ని తెలియజేశారు. చైతన్యవంతమైన ప్రజాస్వామ్యం కోసం ప్రతి ఒక్కరు తమ ఓటు హక్కును కచ్చితంగా వినియోగించుకోవాలని తెలియజేశారు. రాజకీయ నాయకులు ఇచ్చే ఎటువంటి ప్రలోభాలకు లోనవకుండా తమ తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని తెలిపారు. కార్యక్రమంలో నూజెండ్ల మండల ఎమ్మార్వో, ఎంపిడిఒ వీరభద్రాచారి అయినవోలు ఎస్సై లక్ష్మీనారాయణ రెడ్డి, బూతు లెవెల్, రెవెన్యూ అధికారులు, ప్రిన్సిపల్, ఉపాధ్యాయులు విద్యార్థులు పాల్గొన్నారు.



సామాజిక పింఛన్ అందేనా!

వార్డు సచివాలయాల వద్ద ఏర్పాట్లపై నోరుమెదపని సిబ్బంది

ప్రజాశక్తి-చిలకలూరిపేట

ప్రస్తుత ప్రభుత్వ హయాంలో వాలంటరీ వ్యవస్థ ద్వారా వృద్ధులు, వితంతువులు, వికలాంగులకు సామాజిక పింఛన్లను ప్రతి నెలా 1వ తేదీన అందిస్తున్న విషయం తెలిసిందే. అయితే, సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో ఎన్నికల కోడ్ అమలులో ఉండటంతో దీనికి బ్రేక్ పడింది. గ్రామ, వార్డు సచివాలయాల వాలంటీర్ల ద్వారా ఈ పింఛన్ల పంపిణీ చేయకూడదు. ఈ నేపథ్యంలో గ్రామ, వార్డు సచివాలయాల వద్దే పింఛన్ల పంపిణీ చేపట్టాలని ప్రభుత్వం నిర్ణ యించడంతో ఇందుకు సంబంధించిన ఏర్పాట్లు ఏవిధంగా జరుగుతున్నాయనే దానిపై లబ్ధిదారుల్లో ఆసక్తి నెలకొంది. చిలకలూరిపేట పట్టణంలో వార్డు సచివాలయాల సంఖ్య 29. ఒక్కొక్క సచివాలయంలో 10 నుంచి 11 మంది వరకు సిబ్బంది ఉంటారు. పట్టణంలో అన్ని రకాల పింఛన్లు తీసుకునే వారి సంఖ్య ఒక్కొక వార్డులో 500 నుంచి 600 మంది వరకు ఉంటుంది. పింఛన్ల పంపిణీకి సంబంధించిన ఏర్పాట్ల గురించి అడిగితే సచి వాలయ సిబ్బంది ఎటువంటి సమాధానం చెప్పలేదు. ఈ నెల 4 లేదా 5 వ తేదీ నుంచి పింఛన్లు ఇస్తారని సిబ్బంది సమాచారం. అయితే, ఎండలు మండి పోతుండటంతో లబ్ధిదారులు ముఖ్యంగా వృద్ధులు సచివాలయాల దగ్గరకు ఎలా వెళ్లడమని ఆలోచిస్తున్నారు.

క్యూలో నిలబడి పింఛన్ తీసు కోవా లంటే ఇబ్బంది కరంగా ఉంటుందని వికలాంగులు చెబుతున్నారు. ఒక నెల పింఛన్ తీసుకోకపోతే అది వెనక్కి వెళ్ళిపోతుందని, ఆ నెల పింఛన్ ఇక తిరిగి తీసుకోవడం కుదరని విధానం ప్రస్తుతం నడుస్తోందని, ఈ విధానం మారాలని అన్నారు.

ఉపాధి వేతనం రూ.28 పెంపు

ప్రజాశక్తి - రెంటచింతల

కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం పనులకు వెళ్లే వేతనదారులకు రూ. 28 రూపాయలు పెంచుతు ఉత్తర్వులు జారీ చేసినట్లు ఏపీవో జయచంద్ర తెలిపారు. ఇప్పటివరకు రూ.272 ఉన్న వేతనాన్ని రూ.300కు పెంచిందన్నారు ఈ నిర్ణయంతో రెంటచింతల మండలంలో ఉన్న 800 గ్రూపుల్లో 17951 మందికి లబ్ధి చేరుతుందన్నారు 2018 -19లో రూ.125 ఉండే కూలిని వరుసగా రూ.211,రూ.237,రూ. 245, రూ.272, రూ.300కు పెంచినట్లు చెప్పారు. ఐదు సంవత్సరాలలో 25.36 శాతం వేతనం పెరిగిందని, పెంచిన వేతనాలు సోమవారం నుంచి అమలులోకి వస్తాయని వివరించారు.

విత్తన మొలక శాతం అధికంగా ఉండాలి

ప్రజాశక్తి - రెంటచింతల

మిర్చిలో విత్తనం మొలకశాతం అధికంగా ఉండాలని వ్యవసాయ శాఖ కమిషనర్ వారి కార్యాలయం ఎడిఎ ఓబులేసు కోరారు. సోమవారం మిర్చి విత్తన ప్రాసెసింగ్ యూనిట్ ను తనిఖీ చేసి నిర్వాహకులకు పలు సూచనలు చేశారు. అనంతరం విత్తన దుకాణాలను తనిఖీ చేసి రికార్డులను పరిశీలించారు. నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఆయన వెంట మాచర్ల ఏడిఏ జగదీశ్వర్ రెడ్డి మండల వ్యవసాయ అధికారి బ్రహ్మారెడ్డి సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.


వావిలాల నగర్ కాలనీ వాసులతో మాట్లాడుతున్న బొర్రా అప్పారావు

క్రీడా ప్రాంగణానికి మౌలిక సదుపాయాలు కల్పిస్తా

ప్రజాశక్తి-సత్తెనపల్లి రూరల్

వెన్నాదేవి వావిలాల నగర్ లో ఉన్న క్రీడా ప్రాంగణానికి మౌలిక వసతులు కల్పిస్తానని జనసేన నియోజకవర్గ ఇన్చార్జి బొర్రా వెంకట అప్పారావు హామీ ఇచ్చారు. సత్తెనపల్లి మండలం వెన్నాదేవి వావిలాలనగర్ లో బొర్రా అప్పారావు సోమవారం పర్యటించారు. కాందిశీకులతో సమావేశమయ్యారు వారి సమస్యలు తెలుసుకున్నారు. కార్యక్రమంలో సత్తెనపల్లి కౌన్సిలర్ ఆర్.సుమన్, మండల అధ్యక్షులు ఎన్.నాగేశ్వరరావు, సిహెచ్ పూర్ణ,అంకారావు, జి.శ్రీదేవి పాల్గొన్నారు.

ప్రజలపై భారాలు మోపిన ప్రభుత్వం

ప్రజాశక్తి-సత్తెనపల్లి రూరల్

వైసిపి ప్రభుత్వం నిత్యావసర సరుకులు ధరలు , విద్యుత్ చార్జీలు పెంచి ప్రజలపై భారాలు మోపిం దని టిడిపి అధికారంలోకి రాగానే నిత్యావసరాల ధరలు విద్యుత్ చార్జీలు తగ్గిస్తామని టిడిపి-జనసేన-బిజెపి ఉమ్మడి అభ్యర్థి కన్నా లక్ష్మీనారాయణ అన్నారు. సత్తెనపల్లి మండలం కట్టమూరులో సోమవారం రాత్రి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా లక్ష్మీనారాయణ మాట్లాడుతూ సాగునీరు లేక సాగు భారమై రైతులు ఆత్మహత్యలు చేసుకుంటున్నారని అన్నారు. జగన్ పాలనలో ప్రజలు తీవ్రంగా నష్టపోయారని అన్నారు. వైసిపి ఫ్యాన్ రెక్కలు విరగ కొట్టేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారని చెప్పారు. ఇంటింటికి తిరిగి మ్యానిపెస్టో కరపత్రాలను పంపిణీ చేశారు. సత్తెనపల్లి మండలం పాకాలపాడులో గుంటూరు మాజీ మేయర్ కన్నా నాగరాజు ఎన్నికల ప్రచారం నిర్వహించారు. మ్యానిపెస్టో కరపత్రా లను పంపిణీ చేశారు.

వైసిపి విషప్రచారాన్ని తిప్పికొట్టాలి

. ఎన్డిఎ కూటమి వస్తే ముస్లింలకు దళితులకు అన్యాయం జరుగుతుందని వైసిపి చేస్తున్న విషప్రచారాన్ని. ప్రజలకు తెలియజేయాలని కన్నా లక్ష్మీనారాయణ అన్నారు. పట్టణంలోని ఇండియన్ మెడికల్ అసోసియేషన్ హాలులో బిజెపి నాయకులతో సోమవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కన్నా మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి రాజధాని లేకుండా చేసిన ఏకైక ప్రభుత్వంగా వైసిపి చరిత్రలో మిగిలిపోతుందని విమర్శించారు. కార్యక్రమంలో బిజెపి స్టేట్ ఎగ్జిక్యూటివ్ రవిశంకర్, జిల్లా అధ్యక్షులు ఆ లోకం సుధాకర్ .జిల్లా ఇంచార్జ్ శ్రీనివాసరావు. నియోజకవర్గ కన్వీనర్ కట్ట శంకరరావు, నియోజకవర్గ కో కన్వీనర్ పెద్దన్న రావు నాయక్, పట్టణ ప్రెసిడెంట్ శంకర రావు. పాల్గొన్నారు


కట్టమూరు లో ఎన్నికల ప్రచారం చేస్తున్న లక్ష్మీనారాయణ

ప్రజాశక్తి-బెల్లంకొండ

ఎమ్మెల్యే నంబూరు శంకరరావు ఎన్ని కుయుక్తులకు పాల్పడ్డా, ఎన్ని విష ప్రచారాలు చేసినా పెదకూరపాడు నియోజకవర్గంలో గెలిచేది తెలుగుదేశం పార్టీనే అని మాజీ ఎమ్మెల్యే కొమ్మాలపాటి శ్రీధర్ అన్నారు. సోమవారం గుంటూరులోని తన నివాసంలో తనను కలిసిన టిడిపి నాయకులతో ఆయన మాట్లాడారు. గత ఐదేళ్లలో టిడిపి నాయకులు, కార్యకర్తలపై వైసిపి నేతలు పెట్టిన అక్రమ కేసులను, వాటిని అడ్డుపెట్టుకుని పోలీసులు వేధింపులను ఎవరూ మర్చిపోలేదని, వారికి బుద్ధిచెప్పే సమయం వచ్చిందని ఓటుతో సరైన సమాధానం చెబుతారని అన్నారు.




పట్టుపగలే వెలుగుతున్న వీధిలైట్లు

ప్రజాశక్తి-నాదెండ్ల



మండలంలోని చందవరం గ్రామంలో ప్రతి వీధి పట్ట పగలు వీధిలైట్లు వెలుగుతూనే ఉంటాయి. నెలలు తరబడి వెలుగుతూనే ఉన్నాయి అధికారులు మాత్రం పట్టించు కోవట్లేదు. గత ప్రభుత్వం హయాంలో రూ. 200 ఇచ్చే కరెంటు బిల్లు, ప్రస్తుత ప్రభుత్వంలో రూ.1000 పై మాటేనని వినియోగదారులు చెబుతున్నారు. గ్రామాల్లో ఈ విధంగా పట్టపగలు వెలిగే వీధిలైట్లను ఆర్పి కరెంటు వినియోగాన్ని తగ్గించినట్లయితే కొంత మేరకు కరెంట్ బిల్లు కూడా తగ్గుతుందని చెబుతున్నారు. గ్రామంలో ఇప్పుడు ఎనర్జీ అసిస్టెంట్, లైన్‌మాన్ అని పలు రకాలుగా ఉద్యోగస్తులు వచ్చినప్పటికీ వీధిలైట్లు మాత్రం పగలూరాత్రి తేడా లేకుండా వెలుగుతూనే ఉన్నాయని చెబు తున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి పట్టపగలు వీధిలైట్లను వెలగకుండా చూడాలని, విద్యుత్ వినియోగాన్ని తగ్గించాలని కోరుతున్నారు.





ఓటు హక్కు వినియోగించుకోవాలి : తహశీల్దార్

ప్రజాశక్తి - కొల్లిపర


కొల్లిపరలో బైక్‌ర్యాలీతో అవగాహన

ప్రజాస్వామ్య పరిరక్షణ కోసం ప్రతి పౌరుడు తమ ఓటు హక్కును వినియోగించుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందని తాసిల్దార్ ఎన్ శ్రీనివాసులు అన్నారు సోమవారం మండల కేంద్రమైన కొల్లిపర్లు ఓటర్లకు ఓటు హక్కు ప్రాముఖ్యత గురించి అవగాహన కల్పించేందుకు బైక్ ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీ తాసిల్దార్ కార్యాలయం నుండి కొల్లిపర పురవీధులలో ఈ సందర్భంగా ఓటు హక్కు వినియోగించుకుందాం ఇప్పుడు, మన ఓటు మన హక్కు అని నినాదాలు చేశారు. ఈ సందర్భంగా తాసిల్దార్ మాట్లాడుతూ ఓటర్లు ప్రలోభాలకు గురికావద్దని తెలిపారు. కార్యక్రమంలో తాసిల్దార్ కార్యాలయం సిబ్బంది సచివాలయ సిబ్బంది వీఆర్వోలు పాల్గొన్నారు.

ఇవిఎంల నిర్వహణపై అధికారులకు శిక్షణ

ప్రజాశక్తి పొన్నూరు రూరల్



పోలింగ్ కేంద్రాల్లో ఇవిఎంలకు సంబంధించి ఓటర్లు తమ ఓటు వినియోగంలో ఎలాంటి అసౌకర్యం, జాప్యం కలగకుండా తక్షణ చర్యలు తీసుకోవడానికి పోలింగ్ సిబ్బందికి శిక్షణ కార్యక్రమాలు దోహదపడతాయని స్థానిక తహసిల్దార్, ఏఈఆర్ఓ సూర్యనారాయణ సింగ్ అన్నారు. సోమవారం పొన్నూరు అసెంబ్లీ నియోజకవర్గ రిటర్నింగ్ ఆఫీసర్ లక్ష్మి కుమారి ఆదేశాల మేరకు స్థానిక మున్సిపల్ కార్యాలయం కౌన్సిల్ హాల్ లో పోలింగ్ ఆఫీసర్లు, ఏపీవోలకు ఏర్పాటు చేసిన శిక్షణ కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. పోలింగ్ కేంద్రాల్లో ఇవీఎం ల మొరాయించటం, నిర్వహణ లో లోపాలు ఉంటే పోలింగ్ ఆఫీసర్లు, ఏపీవోలు తీసుకోవాల్సిన చర్యలు గురించి శిక్షణ నిర్వహించారు. ఈవీఎంల మరమ్మత్తులు చేసేందుకు బెల్ ఇంజనీర్లను ఏర్పాటు చేయటం జరిగిందన్నారు. కార్యక్రమంలో పొన్నూరు ఎన్నికల డిప్యూటీ తాసిల్దార్ సి వి ఫణికుమార్, సీనియర్ అసిస్టెంట్ ఆనందరావు, రెవెన్యూ ఇన్స్పెక్టర్ రామకష్ణ, ఏ ఎల్ ఎం టి లు, సెక్టార్, రూట్ ఆఫీసర్లు, రెవెన్యూ, మున్సిపల్ కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.


తుళ్లూరులో రైతుల ఆందోళన

అమరావతిని నిర్మించాల్సిందే..

ప్రజాశక్తి - తుళ్లూరు

ప్రజల జీవితాలతో ముడిపడి ఉన్న అంశాలపై రాజకీయాలు తగవని, ఏ పార్టీ అధికారంలోకి వచ్చినా అమరావతి రాజధానిని నిర్మించాల్చిందేనని రైతులు స్పష్టం చేశారు. రాష్ట్ర ఏకైక రాజధానిగా అమరావతిని కొనసాగించాలని డిమాండ్ చేస్తూ రైతులు,రైతు కూలీలు, మహిళలు చేస్తున్న దీక్షలు సోమవారంతో 1567 వ రోజుకు చేరాయి. తుళ్లూరు, నెక్కల్లు, అనంతవరం, వెంకటపాలెం తదితర గ్రామాల్లో ఇళ్ళ వద్ద దీక్షలు సాగాయి. అమరావతి వెలుగు కార్యక్రమంలో భాగంగా కొవ్వొత్తులు వెలిగించి జై అమరావతి అంటూ నినాదాలు చేశారు.





175 అసెంబ్లీ స్థానాల్లో పోటీ

ప్రజాశక్తి-తాడేపల్లి

రాష్ట్రంలోని 175 నియోజకవర్గాల్లో జై భీమ్‌రావు పార్టీ పోటీ చేస్తుందని జడ శ్రావణ్‌కుమార్ తెలిపారు. సోమవారం తాడేపల్లి ఆర్‌సిఎం చర్చిలో ప్రత్యేక ప్రార్థనలు చేసి తన ప్రచారాన్ని ప్రారంభించారు. గత ఐదు సంవత్సరాలుగా బడుగు, బలహీన వర్గాల కోసం పని చేస్తున్నట్లు ఆయన చెప్పారు. మంగళగిరి, తాడికొండ నియోజకవర్గాల నుంచి తాను పోటీ చేస్తున్నట్లు చెప్పారు. మంగళగిరిలో నారా లోకేష్‌కు ఓటు అడిగే హక్కు లేదన్నారు. గెలిచిన మరునాడు నుంచే ఆయన కనిపించరని విమర్శించారు. అనంతరం తాడేపల్లి మెయిన్‌రోడ్డులో ప్రచారం నిర్వహించారు.



ప్రజా సంక్షేమమే వైసిపి అజెండా

ప్రజాశక్తి - మంగళగిరి

ప్రజాసంక్షేమమే వైఎస్సార్‌సీపీ అజెండా అని ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి అన్నారు. నియోజకవర్గ వైసిపి అభ్యర్థిని మురుగుడు లావణ్య విజయాన్ని కాంక్షిస్తూ సోమవారం ఆయన నగరంలోని మెయిన్ బజారులో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా వైసిపి ముఖ్యనాయకులు, కార్యకర్తలతో కలిసి ఇంటింటికి వెళ్లి ఓట్లను అభ్యర్థించారు. అనంతరం ఎమ్మెల్యే ఆర్కే మాట్లాడుతూ కుల,మత, రాజకీయాలకు అతీతంగా అర్హతే ప్రామాణికంగా సంక్షేమ పథకాలను అందించిన ఘనత వైసిపి ప్రభుత్వానిదేనన్నారు. మంగళగిరి నియోజకవర్గంలో కోట్లాది రూపాయల నిధులతో అభివృద్ధి పనులు చేపట్టామని వివరించారు. మళ్లీ అధికారంలోకి వస్తే మిగిలిన సమస్యలను పరిష్కరిస్తా మన్నారు. రాష్ట్రాభివృద్ధి, సంక్షేమం కొనసాగాలంటే వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని మళ్లీ సీఎంగా గెలిపించుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. రానున్న ఎన్నికల్లో నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థిని మురుగుడు లావణ్యను ఫ్యాన్ గుర్తుపై ఓటేసి గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే కాండ్రు కమల తదితరులు పాల్గొన్నారు.



లావణ్యను గెలిపించుకోవాలి

జాతీయ చేనేత ఐక్యవేదిక రాష్ట్ర అధ్యక్షులు రుషింగప్ప

ప్రజాశక్తి - మంగళగిరి

మంగళగిరి అసెంబ్లీ నియోజవర్గంలో వైసీపీ తరఫున పోటీ చేస్తున్న చేనేత మహిళ మురుగుడు లావణ్య గెలుపు ఖాయమని జాతీయ చేనేత ఐక్యవేదిక రాష్ట్ర అధ్యక్షులు ఎన్ రుషింగప్ప అన్నారు. సోమవారం సాయంత్రం మంగళగిరి ప్రెస్‌క్లబ్‌లో జరిగిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ తెలిపారు. చేనేత పరిశ్రమలో పద్మశాలీలను గుర్తించింది వైసిపి అని అన్నారు. మంగళగిరి నియోజకవర్గం లో చేనేతలు ఎక్కువగా ఉన్నారని అన్నారు. వైసిపి చేనేత విభాగం జిల్లా అధ్యక్షులు మునగాల మల్లేశ్వరరావు మాట్లాడుతూ మంగళగిరి నియోజకవర్గంలో పద్మశాలీలకు ఎమ్మెల్సీ, ఆప్కో చైర్మన్ పదవులు, మార్కెట్ యార్డ్ చైర్మన్ పదవులు ఇవ్వడం జరిగిందని అన్నారు. మరల ఎమ్మెల్యే అభ్యర్థిగా చేనేత మహిళ మురుగుడు లావణ్య వైఎస్ఆర్సిపి కేటాయించడం జరిగిందన్నారు. ఈ సమావేశంలో వైఎస్ఆర్సిపి నాయకులు ఆకురాతి రాజేష్, ఎం మునుస్వామి తదితరులు పాల్గొన్నారు.

గుంటూరు, విజయవాడకు దీటుగా తెనాలిని అభివృద్ధి చేస్తాం : నాదెండ్ల

ప్రజాశక్తి - తెనాలి

గుంటూరు విజయవాడకు దీటుగా తెనాలిని అభివృద్ధి చేస్తానని టిడిపి, జనసేన, బిజెపి కూటమి అభ్యర్థి నాదెండ్ల మనోహర్ అన్నారు. స్థానిక నాజరుపేట ఎన్.వి.ఆర్ కన్వెన్షన్‌లో సోమవారం భవన నిర్మాణ కార్మికులతో ఆయన సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైసీపీ పాలనలో రియల్ ఎస్టేట్, నిర్మాణ రంగం కుదిలైందని, ఆయా రంగాలపై ఆధారపడిన అనేకమంది కార్మికుల జీవన ప్రమాణాలు దెబ్బతిని, చివరకు వలసలు వెళ్లాల్సిన పరిస్థితి నెలకొందన్నారు. అధికారంలోకి రాగానే ఖచ్చితంగా నిర్మాణ రంగానికి పెద్దపీట వేస్తామన్నారు. పార్టీ జిల్లా అధ్యక్షులు గాదె వెంకటేశ్వరరావు మాట్లాడుతూ సహజ సిద్ధంగా లభించే ఇసుకను సామాన్యులకు అందుబాటులో లేకుండా సొమ్ము చేసుకునే పరిస్థితుల్లో వైసిపి నేతలు ఉన్నారన్నారని, ఫలితంగా నిర్మాణరంగం నిర్వీర్యమైం దన్నారు. మహిళా కమిషన్ మాజీ చైర్పర్సన్ నన్నపనేని రాజకుమారి మాట్లాడుతూ గతంలో శాసనసభ్యులుగా, స్పీకర్గా, డిప్యూటీ స్పీకర్గాపనిచేసి తెనాలి ప్రాంత అభివృద్ధికి స్పష్టమైన ప్రణాళికతో ఉన్న మనోహర్‌ను గెలిపించాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. సమావేశంలో వైయస్సార్ అండ్ ఎస్వీర్ కళాశాల కరస్పాండెంట్ నన్నపనేని సుధాకర్, భవన నిర్మాణ రంగ కార్మికుల సంఘం అధ్యక్షులు రెడ్రౌతు శ్రీనివాసరావు, వడ్రంగి యూనియన్ ప్రెసిడెంట్ సమీర్, సెంట్రింగ్ యూనియన్ ప్రెసిడెంట్ వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి చేయడానికే వచ్చా : లోకేష్

ప్రజాశక్తి-తాడేపల్లి

అభివృద్ధి కోసమే తాను రాజాకీయాల్లోకి వచ్చానని, ప్రజలంతా ఆశీర్వదించాలని మంగళగిరి టిడిపి అభ్యర్థి నారా లోకేష్ అన్నారు. సోమవారం తాడేపల్లి పట్టణంలోని మహానాడులో జరిగిన రచ్చబండ, శ్రీ చక్ర అపార్టుమెంట్ల వాసులతో జరిగిన సమావేవంలో ఆయన పాల్గొని మాట్లాడారు. మంగళగిరికి పరిశ్రమలు రావని స్థానిక ఎమ్మెల్యే చెప్పడం హాస్యాస్పదమన్నారు. పరిశ్రమలు తీసుకొచ్చి యువతకు ఉద్యోగాలు కల్పించే బాధ్యత తాను తీసుకుంటానన్నారు. గత ఎన్నికల్లో తాను ఓడిపోయినా గత ఐదు సంవత్సరాల నుంచి ప్రజలతోనే ఉండి సేవ చేస్తున్నట్లు చెప్పారు. పదేళ్ల పాటు ఎమ్మెల్యేగా ఉండి ఆర్‌కె ప్రజలకు ఏం చేశారో చెప్పాలని డిమాండ్ చేశారు. ఆర్‌కె చేతగాని తనం వల్లే మంగళగిరి యువత ఉద్యోగాల కోసం హైదరాబాద్, చెన్నై, బెంగుళూరు నగరాలకు వెళ్లాల్సి వస్తుందన్నారు. తమ ప్రభుత్వం అధికారంలోకి వస్తే మంగళగిరిలో 50 వేల మందికి ఉద్యోగాలు కల్పిస్తామన్నారు. కార్యక్రమంలో టిడిపి పట్టణ అధ్యక్షులు వల్లభనేని వెంకట్రావు తదితరులు పాల్గొన్నారు.

ప్రత్యేక అలంకరణలో శ్రీకనకదుర్గ భవాని

ప్రజాశక్తి - పొన్నూరు రూరల్



పట్టణంలో వేంచేసి ఉన్న శ్రీ కనకదుర్గ భవాని అమ్మ వారి ఆలయంలో చండీ, నవగ్రహ, నవవిధ శాంతి హోమాలు, కోటి కుంకు మార్చన కార్యక్రమాలు అంగరంగ వైభవంగా ప్రారంభమ య్యాయి. ఆదివారం నుండి గురువారం వరకు ఈ యాగములు నిర్వహిస్తారు. ఈ సందర్భంగా శ్రీ కనకదుర్గ భవాని అమ్మ వారు ప్రత్యేక అలంకరణలో భక్తులకు దర్శనం ఇచ్చారు. భక్తులకు తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు. సోమవారం చండీ, నవవిధ శాంతి హెూమాలు, గోపూజ, సహస్ర జ్యోతి లింగార్చన, పూజా కార్యక్రమాలు నేత్రపర్వంగా చేశారు. మంగళవారం విశేష సూర్య యంత్ర పూజ చేసే దీపాలు వెలిగిస్తారు. బుధవారం ఉదయం హోమాలు జరుగుతాయి. సాయంత్రం శివపార్వతుల కళ్యాణం నిర్వహిస్తారు. చివరి రోజైనా గురువారం మహా అన్న సంతర్పణ నిర్వహిస్తారు. అమ్మవారికి పూజాదికాలు దేవాలయ ప్రధాన అర్చకులు రామిశెట్టి శ్రీనివాసరావు నిర్వహిస్తున్నారు.

మన ఓటు.. మన భవిష్యత్తు..

దుగ్గిరాలలో రాజధాని రైతులు ప్రచారం

ప్రజాశక్తి - దుగ్గిరాల

కాపాడుకుందాం అమరావతి నీ ఆంధ్రప్రదేశ్ రాజధానిని అనే నినాదంతో రాజధాని నిర్మాణానికి భూములు ఇచ్చిన రైతులు సోమవారం మండల కేంద్రం దుగ్గిరాలలో ఇంటింటికి తిరిగి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా జేఏసీ కన్వీనర్ పువ్వాడ సుధాకర్ మాట్లాడుతూ రాజధానిని కాపాడుకోవడం ద్వారా పేద దళిత బడుగు బలహీన ముస్లిం మైనార్టీ వర్గాల ప్రజల జీవన ప్రమాణాలు పెరగుతాయని పిల్లలకు బంగారు భవిష్యత్తు ఉంటుందన్నారు. రాజధాని నిర్మాణం వలన పేదరికం నుండి జీవనోపాధి లభించి పేదరికం నుండి విముక్తి పొంది జీవన ప్రమాణాలు పెరుగుతాయి అన్నారు. ఈ విషయమై ఇంటింటికి తిరిగి ప్రచారం నిర్వహి స్తున్నారు. రాష్ట్ర నడిబొడ్డులో రాజధాని ఆవశ్యకతను గుర్తించి గత ప్రభుత్వం అమరావతిని రాజధాని చేశారని దురదృష్టవశాత్తు జగన్ రాష్ట్రాని అభివృద్ధి చేస్తానని అధికారంలోకి వచ్చి రాజ్యాంగం అనుమతి లేని మూడు రాజధానులు నిర్మిస్తానని ఓట్లు వేయండి అని ప్రచారం చేస్తున్నాడన్నారు. జగన్ ఈసారి అధికారంలోకి వస్తే పిల్లల భవిష్యత్తు నాశనం అవుతుందన్నారు. అప్పులు చేసి సంక్షేమ పథకాలు అమలు చేస్తూ తన సొత్తు అన్నట్లుగా ప్రచారం చేసుకుంటున్నారని ఇది ప్రజల సొత్తు అని ఏ ప్రభుత్వమైనా సంక్షేమ పథకాలు అమలు చేస్తుందన్నారు. అమరావతి రాజధాని చేసి బిడ్డల భవిష్యత్తు కాపాడుకుంటూ సంపద సృష్టించే ప్రభుత్వాన్ని ఎన్నుకోవాలి అన్నారు. మన ఓటు మన భవిష్యత్తు అని ఇంటింటికి తిరిగి ప్రచారం చేస్తున్నారు ప్రజల నుండి భారీ స్పందన వస్తుందని ఈసారి జగన్ ఓటమి తప్పదు అన్నారు. కార్యక్రమంలో రాజధానికి భూములు ఇచ్చిన రైతులు గుర్రం జయలక్ష్మి, జి అనిత, వై నాగమల్లేశ్వరి, ఎం సుధారాణి, కె జనార్దన్ రావు, పి వి రావు స్థానికులు గూడూరు వెంకటరావు పటాన్ జున్ను ఖాన్, జంపాల నరేంద్ర తదితరులు పాల్గొన్నారు.


ప్రచారానికి భారీగా తరలించి వచ్చిన అమరావతి ప్రాంత రైతులు

భారీగా పెరిగిన రైల్వే ఆదాయం

ప్రజాశక్తి గుంటూరుజిల్లా ప్రతినిధి



గుంటూరు రైల్వే డివిజన్ 2023-24 ఆర్థిక సంవత్సరంలో ఆదాయం గణనీయంగా పెరిగింది. గుంటూరు డివిజన్ ఏర్పడినప్పటి నుండి ఇప్పటివరకు అత్యధికంగా 3.364 మిలియన్ టన్నుల (రైల్వే మెటీరియల్ కన్సైన్‌మెంట్ మినహా) సరుకు రవాణా జరిగింది. గత సంవత్సరంతో పోల్చితే లోడింగ్‌లో ఎన్నడూ లేని విధంగా అత్యధిక పెరుగుదల నమోదు అయిందని అధికారులు తెలిపారు.గుంటూరు డివిజన్ ఏర్పడినప్పటి నుండి రూ. 395.8 కోట్ల మొత్తంతో 2023-24 సంవత్సరంలో సరకు రవాణా ఆదాయంలో రెండవ అత్యధిక ఆదాయం లభించింది. 4.1 లక్షల టన్నులతో గుంటూరు డివిజన్ ఏర్పడినప్పటి నుండి 2024 మార్చిలో ఒకే నెలలో అత్యధికంగా సరుకు రవాణా చేశారు. మార్చి 2024లో ఒకే నెలలో ఆర్జించిన అత్యధిక రాబడి రూ.47.09 కోట్లు వచ్చిందని గుంటూరు రైల్వే డివిజన్ మేనేజర్ రామకష్ణ తెలిపారు. అత్యుత్తమ సరుకు రవాణా పనితీరును సాధించడం, మునుపెన్నడూ లేని విధంగా అత్యధిక సరుకు రవాణాను నమోదు మరియు ఆదాయాన్ని నమోదుచేయడం ద్వారా ఈ కీలక విభాగంలో వృద్ధిని కలుగ చేయడంలో డివిజన్ నిబద్ధత మరియు ప్రత్యేక దృష్టి సారించడాన్ని నొక్కి చెబుతుందన్నారు. ఈ అత్యుత్తమ విజయానికి ఆపరేటింగ్ మరియు కమర్షియల్ టీం చేసిన కృషిని రామకృష్ణ అభినంది ంచారు. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో అదే చొరవను కొనసాగించాలని వారికి సూచించారు.

జిఎంసికి రూ.98.25 కోట్లు పన్ను వసూళ్లు

ప్రజాశక్తి-గుంటూరు



ఆస్తి పన్ను వసూళ్ళల్లో గుంటూరు నగరపాలక సంస్థ మార్చి 31వ తేదీ ఒక్కరోజే 5.09 కోట్లు వసూలు చేసినట్లు నగర కమిషనర్ కీర్తి చేకూరి ఒక ప్రకటనలో తెలిపారు. ఆస్తి పన్నుపై వడ్డీ రాయితీని నగర ప్రజలు విరివిగా సద్వినియోగం చేసుకున్నారని, పన్ను వసూళ్ళలో రాష్ట్ర స్థాయిలో విశాఖపట్నం, విజయవాడ తర్వాత 3వ స్థానంలో గుంటూరు నగరపాలక సంస్థ నిలిచిందన్నారు. షుమారు రూ.20 కోట్ల బకాయిలతోపాటు, మొత్తం రూ.143.46 కోట్ల ప్రైవేట్ డిమాండ్‌కుగాను మార్చి 31 నాటికి రూ.98.25 కోట్లు వసూలు అయినట్లు వివరించారు. చివరి రోజు అత్యధిక వసూళ్లు చేసిన జాబితాలో జిఎంసి రెండో స్థానంలో నిలిచిందన్నారు. నగరంలో ప్రభుత్వ, ప్రైవేట్ అసెస్మెంట్‌ల నుండి షుమారు రూ.280.86 కోట్లు డిమాండ్ ఉండగా 2023 ఏప్రిల్ 1 నుండి 2024 మార్చి 31 నాటికి 114.68 కోట్లు వసూళ్లు అయ్యాయన్నారు.ఏప్రిల్ 1 నుండి 5వ తేదీ వరకు ఈఆర్పీ సర్వర్ ప్రస్తుత ఆర్థిక సంవత్సర డిమాండ్ అప్‌డేట్ చేస్తున్నందున అందుబాటులో ఉండదని, 6వ తేదీ నుండి తిరిగి అందుబాటులో ఉంటుందని తెలిపారు.

నేటి నుండి ప్రత్యేక అవసరాలు గల పిల్లలకు నిర్ధారణ పరీక్షలు

ప్రజాశక్తి-గుంటూరు

గుంటూరు జిల్లాలో సహిత విద్య విభాగం ఆధ్వర్యంలో ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతూ ప్రత్యేక అవసరాలు గల పిల్లలకు కావాల్సిన ఉపకరణాలు అందించేందుకు నిర్ధారణ పరీక్షలకు మంగళవారం నుండి క్యాంపులు నిర్వహిస్తున్నట్లు సమగ్ర శిక్ష అడిషనల్ ప్రాజెక్ట్ కో-ఆర్డినేటర్ జి.విజయలక్ష్మి ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల 2న తెనాలి బాలాజీరావుపేట భవిత కేంద్రంలో, 3వ తేదీన పెదనందిపాడు భవిత కేంద్రంలో, 4, 6 తేదీలలో గుంటూరు, బ్రాడీపేటలోని జిల్లా సహిత విద్యా వనరుల కేంద్రంలో పరీక్షలు జరుగుతాయన్నారు. కావున ప్రత్యేక అవసరాలు గల పిల్లల తల్లిదండ్రులు, ప్రధానోపాధ్యాయులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.



జుబేదాబేగంను సత్కరిస్తున్న ఉర్దూ డిఐ తదితరులు

ఉపాధ్యాయ వృత్తి విలువైనది

ప్రజాశక్తి-గుంటూరు

భావి భారత పౌరుల్ని తీర్చిదిద్దటంలో ఉపాధ్యాయుల కృషి మరువలేనిదని, అన్ని వృత్తులతో పోల్చుకుంటే ఉపాధ్యాయ వృత్తి ఎంతో విలువైనదని వక్తలు పేర్కొన్నారు. స్థానిక చౌత్రా సెంటర్‌లోని ప్రభుత్వ బాలికోన్నత ఉర్దూ పాఠశాలలో 40 సంవత్సరాల సర్వీసు చేసి పదవీ విరమణ చేసిన సందర్భంగా ఉపాధ్యాయురాలు జుబేదా బేగంను ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా నిర్వహించిన అభినందన సభలో సామాజిక వేత్త డాక్టర్ జి.రాజసుందర్‌బాబు పాల్గొని మాట్లాడుతూ ఉపాధ్యాయ వృత్తి గొప్పదనాన్ని మరే వృత్తితో పోల్చలేమన్నారు. ఉర్దూ పాఠశాలల ఉపతనిఖీ అధికారి షేక్.మహ్మద్ ఖాసిం మాట్లాడుతూ తోటి ఉపాధ్యాయులందరికీ జుబేదాబేగం ఆదర్శమని చెప్పారు. సన్మాన సభలో బోయపాలెం డైట్ కళాశాల ప్రిన్సిపాల్ సుభాని, మాజీ ప్రభుత్వ ఉర్దూ డిఐ కైరున్సీసా, ప్రముఖ ఇంజినీరు పిఎస్ షరీఫ్, ప్రకాశం జిల్లా హ్యాండ్లూమ్స్ అండ్ టెక్స్‌టైల్స్ డిప్యూటీ డైరెక్టర్ బి.ఉదయ్‌కుమార్, ప్రధానోపాధ్యాయురాలు బి.విజయలక్ష్మి తదితరులు ప్రసంగించారు. అనంతరం ఉపాధ్యాయులు, విద్యార్థులు జుబేదాబేగం దంపతుల్ని ఘనంగా సత్కరించారు.

పిల్లల పట్ల అప్రమత్తంగా ఉండాలి : ఎమ్మెల్సీ కెఎస్

ప్రజాశక్తి-గుంటూరు



మాట్లాడుతున్న కెఎస్ లక్ష్మణరావు

స్థానిక గోరంట్లలోని శారదా స్కూల్ వార్షికోత్సవం సోమవారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఎమ్మెల్సీ కెఎస్ లక్ష్మణరావు ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడుతూ తల్లిదండ్రులు పిల్లల విషయంలో, సామాజిక మాధ్యమాల విషయంలో అప్రమత్తంగా వ్యవహరించాలని చెప్పారు. స్కూల్ చైర్మన్ పి.చలపతిరావు మాట్లాడుతూ పిల్లలకు అతి ముఖ్యమైనది క్యారెక్టర్ అని, మంచి క్యారెక్టర్ వృద్ధి చేయటానికి తాము ప్రాధాన్యత ఇస్తామన్నారు. స్కూల్ డైరెక్టర్ పి.భారతి వాణి మాట్లాడుతూ శారదా స్కూల్ పిల్లలను అభివృద్ధి పథంలో నడిపిస్తూ, పూర్వ విద్యార్థులు అందరూ మంచి రంగాల్లో స్థిరపడ్డారని చెప్పారు. వై.మధుసూదన్‌రెడ్డి మాట్లాడుతూ ప్రతి విద్యార్థి సామాజిక బాధ్యతగా జీవితంలో స్థిరపడిన తర్వాత స్కూల్‌కు ఎంతోకొంత తిరిగి ఇవ్వాలని కోరారు. అనంతరం విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు అకట్టుకున్నాయి. కార్యక్రమంలో పోటీ మల్లిఖార్జునరావు ప్రసంగించారు.

పెరుగుతున్న గుండె జబ్బుల వ్యాధిగ్రస్తులు

జిజిహెచ్‌కు రోజుకు 400 మంది రాక

ప్రజాశక్తి గుంటూరు జిల్లా ప్రతినిధి



రోగులతో ఓపీ విభాగాన్ని ప్రారంభిస్తున్న సూపరింటెండెంట్

ప్రభుత్వ ఆసుపత్రి గుండె జబ్బుల ఓపిని ప్రతిరోజూ నాలుగు వందల నుంచి అయిదు వందల మంది వరకు వస్తుండటం వల్ల రోగుల అవసరాలను గుర్తించి ప్రతి రోజు ఓపి ఉండేవిధంగా చర్యలు తీసుకుంటు న్నట్లు సూపరింటెండెంట్ డాక్టర్ కిరణ్ కుమార్ చెప్పారు. సోమవారం క్షయ వ్యాధి విభాగం లో నూతనంగా గుండె జబ్బుల ఓపి విభాగాన్ని ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా డాక్టర్ కిరణ్ కుమార్ మాటా ్లడుతూ ప్రతి విభాగాన్ని రోగులతో ప్రారంభించామని చెప్పారు. గతంలో వారంలో మూడు రోజులు మాత్రమే గుండె సంభందిత ఓ.పి. ఉండేదని రోగుల రద్దీని దృష్టిలో పెట్టుకుని ప్రతిరోజూ ఓపి ఏర్పాటు చేస్తున్నామని ఆయన వివరించారు. సుదూర ప్రాంతాల నుంచి వచ్చే రోగులు రోజు మార్చి రోజు రావడం వల్ల ఇబ్బందులు పడుతున్నారని అందువల్ల ఈ మార్పు చేసినట్లు ఆయన చెప్పారు. గుండె జబ్బుల ఓపిలో ప్రతి రోగికి ఒకే చోట పరీక్షలు జరగక పోవడం వల్ల ఇబ్బం దులు పడుతు న్నారని వారి బాధలను గుర్తించి నూతనంగా ఏర్పాటు చేసిన ఈ ఓపి లో అన్ని రకాల పరీక్షలు ఒకే చోట ఉండేవిధంగా చేస్తున్నామని ఆయన చెప్పారు. ఇసిజి, ఎకో(గుండె స్కాన్), టియంటి (ట్రెడ్ మిల్), రక్త పరీక్షలు (ట్రొపోనిన్, లిపిడ్ ప్రొఫైల్, సీరం క్రియాటినిన్, షుగర్ పరీక్షలు) ప్రతిరోజు గండె జబ్బుల ఒపి విభాగం లో నిర్వహిస్తారని ఆయన తెలిపారు.

ఎన్నికల ఏర్పాట్లు వేగవంతం చేయాలి : కమిషనర్

ప్రజాశక్తి-గుంటూరు



సమావేశంలో అధికారులతో మాట్లాడుతున్న కమిషనర్

సార్వత్రిక ఎన్నికల నిర్వహణకు అవ సరమైన ఏర్పాట్లను వేగవంతం చేయాలని నగర కమిషనర్, గుంటూరు తూర్పు నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి కీర్తి చేకూరి అధికారులను ఆదేశించారు. ఎన్నికల నిర్వహ ణకు అవసరమైన ఏర్పాట్లపై సోమవారం కమీషనర్ ఛాంబర్‌లో ఆయా విభాగాల అధి కారులతో సమీక్షా సమావేశం నిర్వహి ంచారు. ఈ సందర్భంగా కమీషనర్ మాట్లాడుతూ ఎన్నికల ప్రక్రియలో భాగంగా ఈ.వి.యంలను పంపిణీ కేంద్రం నుండి పోలింగ్ కేంద్రాలకు తరలించడానికి రూట్ ఆఫీసర్లతో సమన్వయం చేసుకుంటూ అవసరమైన వాహనాలను ముందుగానే సిద్ధం చేయాలని ఆదేశించారు. డిస్ట్రిబ్యూషన్ సెంటర్‌లో మౌలిక వసతులు, ఇతర ఏర్పాట్లను వేగంగా పూర్తి చేసేలా ఏ.ఆర్.ఓలు పర్యవేక్షణ చేయాలన్నారు. క్షేత్ర స్తాయిలో ఏ సమస్య ఎదురైనా తమ దృష్టికి తీసుకురావాలన్నారు. ఎన్నికల విధుల్లో ఉండే ప్రభుత్వ ఉద్యోగులు వినియోగించుకునే పోస్టల్ బ్యాలెట్‌కు అధికారులు, సిబ్బందిని కేటాయించా లన్నారు. మోడల్ కోడ్ అఫ్ కండక్ట్, ఫ్లైయింగ్ స్క్వాడ్ బందాలు మరింత విస్తతంగా పర్యటిస్తూ, క్షేత్ర స్తాయిలో ఎన్నికల ప్రవర్తనా నియమావళి ఉల్లంఘించే వారిపై కేసులు నమోదు చేయటం, అనుమతి లేని ప్రచార సామగ్రి, వాహనాలు సీజ్ చేయాలన్నారు. ఎన్నిక నియమావళి ఉల్లంఘించే వారిపై యఫ్.ఐ.ఆర్‌లు ఫైల్ చేయడంలో పోలీస్ శాఖతో సమన్వయం చేసుకొని జాప్యం లేకుండా చర్యలు తీసుకోవాలని ఏ.ఆర్.ఓ లను ఆదేశించారు. సమావేశంలో సెక్టోరల్ అధికారి శ్రీధర్, ఏ.ఆర్.ఓ లు సునీల్, భీమరాజు, డిప్యూటీ కమీషనర్ వెంకట కృష్ణయ్య,ఈ.ఈ సుందర రామి రెడ్డి ఇతర అధికారులు పాల్గొన్నారు.

ఎఎల్ బి.ఈడీ కాలేజీలో స్ట్రాంగ్ రూమ్

ప్రజాశక్తి-గుంటూరు

సార్వత్రిక ఎన్నికల్లో భాగంగా ఈవిఎంల కమిషనింగ్, పంపిణీ కేంద్రాలు, స్ట్రాంగ్ రూమ్‌లలో తగిన ఏర్పాట్లు చేపట్టాలని నగర పాలక సంస్థ అదనపు కమిషనర్, పశ్చిమ నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి కె.రాజ్యలక్ష్మి అధికారులను ఆదేశించారు. సోమవారం స్థానిక లాడ్జి సెంటర్‌లోని ఏ.యల్ బి.ఈడి కాలేజీలోని మీటింగ్ హాల్స్, తరగతి గదులను ఈవిఎంల కమిషనింగ్, పంపిణీ కేంద్రాలు, స్ట్రాంగ్ రూమ్ ల కోసం అధికారులతో కలిసి పరిశీలించి తగు ఆదేశాలు జారీ చేశారు.ఈ సందర్భంగా ఆర్ఒ మాట్లాడుతూ సార్వత్రిక ఎన్నికల్లో పశ్చిమ నియోజకవర్గంలో వినియోగించే ఈవిఎంలు, వివి ప్యాట్‌ల కమిషనింగ్, స్ట్రాంగ్‌రూమ్, పంపిణీ కేంద్రాలను స్థానిక బి.ఈడి కాలేజిలో ఏర్పాటు చేయనున్నామని, అందుకు తగిన ఏర్పాట్లు చేయాలని పట్టణ ప్రణాళిక, ఇంజినీరింగ్ అధికారులను ఆదేశించారు. ఈవిఎంలు భద్ర పరిచే స్ట్రాంగ్‌రూమ్‌లను ఆయా విభాగాల ఉన్నతాధికారులు, ఏఆర్‌ఓలు ప్రత్యక్ష పరిశీలన చేయాలని, ఎన్నికల కమిషన్ మార్గదర్శకాలకు అనుగుణంగా తగిన ఏర్పాట్లు చేయాలన్నారు. స్ట్రాంగ్ రూమ్ నుండి కమిషనింగ్ కేంద్రానికి అసెంబ్లీ, పార్లమెంటు ఈవిఎంలను వేరుగా తెచ్చేలా బ్యారికేడింగ్ చేపట్టాలని, అవసరమైన విద్యుత్, త్రాగునీరు వంటి మౌలిక వసతులు ఏర్పాటు చేయాలని ఇంజినీరింగ్ అధికారులను ఆదేశించారు. పర్యటనలో ఏఆర్‌ఓలు సి.హెచ్ శ్రీనివాస్, సీనా రెడ్డి,నిరంజన్, కుమార్, ఎ.ఈ.ఆర్.ఓ శ్రీనివాసరావు, సూపరింటెండెంట్ సాంబశివరావు, పట్టణ ప్రణాళిక, ఇంజినీరింగ్ అధికారులు పాల్గొన్నారు.



అధికారులతో మాట్లాడుతున్న రాజ్యలక్ష్మి